

చింతపండుకు గిరాకీ

- కోనాం సంతలో పెరిగిన ధర
- 20 కిలోల కావడి చింతపండు రూ.1,400లకు కొనుగోలు
- గత వారంతో పోలిస్తే రూ.400 అధికం
- గిరిజనుల మోముల్లో సంతోషం

· 8లో



సీఎంకు వినతుల వెల్లువ

- నిలిచిపోయిన ఇంటర్వ్యూలు నిర్వహించాలని అసిస్టెంట్ ఆచార్యుల స్క్రీనింగ్ పరీక్షల అర్హత అభ్యర్థులు
- నజీర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరిన ఉత్తరాంధ్ర మసీదుల కమిటీ సభ్యులు



నజీర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరుతున్న ముస్లిం మత పెద్దలు

విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):
తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఉదయం పలువురు జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వినతిపత్రాలు అందజేశారు. మాజీ మంత్రి దగ్గుపాటి వెంకటేశ్వరరావు రాసిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం అర్ధరాత్రి సీఎం నగరానికి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేశారు. గురువారం ఉదయం పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు గీతం విశ్వవిద్యాలయానికి బయలుదేరబోతుండగా ఆయనకు పలువురు వినతిపత్రాలు అందజేసి, గోడు చెప్పుకున్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించి 2017లో నిలిచిపోయిన ఇంటర్వ్యూలు నిర్వహించాలని అసిస్టెంట్ ఆచార్యుల స్క్రీనింగ్ పరీక్షల అర్హత అభ్యర్థులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 24 వేల మంది పరీక్ష రాయగా, ఇంటర్వ్యూలకు 3,436 మంది అర్హత సాధించారన్నారు. రాత పరీక్షలో విజయం సాధించిన తమకు ఇంటర్వ్యూలు నిర్వహించి తగిన న్యాయం చేయాలని కోరారు. అలాగే 2020 ఫిబ్రవరిలో విపక్ష నేతగా ఉన్న తమ (చంద్రబాబునాయుడు)పై విశాఖ ఎయిర్‌పోర్టులో దాడి చేసిన వైసీపీ నేతలు, కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్టు పోలీసులు సుమోటోగా కేసు నమోదుచేసినా, ఇంతవరకూ దర్యాప్తు చేయలేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. నగరానికి చెందిన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని ఉత్తరాంధ్ర మసీదుల కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. కాగా 55వ వార్డు పరిధి రెడ్డికంచరపాలెంలో ప్రభుత్వం ఇచ్చిన 60 గజాల స్థలంలో పైఅంతస్థు నిర్మాణానికి సచివాలయ సిబ్బంది అడ్డుపడుతున్నారని, లంచం ఇవ్వాలని పదేపదే వేధిస్తున్నారని షైలపల్లి హరిబాబు అనే వ్యక్తి సీఎంకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రిని ... మిగతా 8వ పేజీలో



గీతం విశ్వవిద్యాలయంలో జరిగిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, రచయిత దగ్గుబాటి. -వార్త మెయిన్‌లో

ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు

విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):
నగర పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పార్టీ నేతలు, అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. గురువారం మధ్యాహ్నం విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, ఆర్డీవో పి.శ్రీలేఖ, డీసీపీ మేరీ ప్రశాంతి, తదితరులు వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

అక్రమ మైనింగ్‌పై కొరడా

రాయి క్వారీల్లో విజిలెన్స్ తనిఖీలు ముమ్మరం

- వివిధ అంశాలపై క్షుణ్ణంగా ఆరా
- అనుమతులు లేని క్వారీలు సీజ్
- ఉల్లంఘనలకు పాల్పడినట్టు నిర్ధారణ అయితే జరిమానా
- అక్రమ క్వారీల్లో వైసీపీ నేతలవే అధికం
- అధికార పార్టీ నేతలు వీరితో కుమ్మక్కైనట్టు ఆరోపణలు



అనకాపల్లి మండలం వేటజంగాలపాలెంలో మైనింగ్ విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన రాయి క్వారీ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
జిల్లాలో మైనింగ్ అక్రమాలపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మైనింగ్ అక్రమాలతో కోట్లాది రూపాయలు గడించిన నేతలే లక్ష్యంగా అనధికార రాయి క్వారీల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గనుల శాఖ విజిలెన్స్ విభాగం ఏడీ అశోక్‌కుమార్ నేతృత్వంలో మైనింగ్, కాలుష్య నియంత్రణ మండలి, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో ఏర్పాడిన బృందం నల్లరాయి క్వారీలపై ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 185కిపైగా క్వారీలు వుండగా, అనకాపల్లి మండలంలో పెద్ద సంఖ్యలో ఉన్న రాయి క్వారీల్లో అక్రమాలపై విజిలెన్స్ బృందం దృష్టి సారించింది. క్వారీలు నిర్వహిస్తున్న వారు కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు పొందారా? ఏ సర్వే నంబర్లలో మైనింగ్ చేసేందుకు అనుమతి పొందారు? లీజు గడువు ఎంతవరకు ఉంది?అన్న వివరాలను పరిశీలిస్తున్నారు. ఇంకా మైనింగ్ వల్ల చుట్టుపక్కల ఉన్న చెరువులకు నష్టం ఏమైనా వాటిల్లుతున్నదా? సమీప గ్రామాల్లో నివాసం వుంటున్న వారు ఇబ్బందులు ఏమైనా పడుతున్నారా? అన్న వాటి గురించి ఆరా తీస్తున్నారు. ఇప్పటికే రెండు, మూడుసార్లు నిర్వహించిన తనిఖీల్లో విస్తుగొలిపే అక్రమాలు వెలుగు చూశాయి. కుంచంగి, కూండ్రం, వేటజంగాలపాలెం పరిసరాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఎనిమిది రాయి క్వారీలను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. వే బిల్లులు లేకుండా బండరాళ్లు, రోడ్డు మెటల్ రవాణా చేస్తున్న 11 లారీలను పట్టుకొని జరిమానా విధించారు. ఇంకా వేటజంగాలపాలెం, కుంచంగి, మార్టూరు గ్రామాల్లో అనుమతి పొందిన క్వారీల్లో నిర్దేశించిన హద్దులకు మించి మైనింగ్ చేసినట్టు అధికారులు గుర్తించారు. ఆయా క్వారీల నిర్వాహకులకు భారీగా అపరాధ రుసము విధించి ప్రభుత్వానికి నివేదించారు.

వైసీపీ నేతల ఆధ్వర్యంలో క్వారీలు

అనకాపల్లి మండలం మార్టూరు, కుంచంగి, కూండ్రం, వేటజంగాలపాలెం, మామిడిపాలెం, బవులువాడ, హెచ్ఎన్ అగ్రహారం, మాకవరం గ్రామాల పరిధిలో సుమారు 120 రాయి క్వారీలు వున్నాయి. వీటిలో సగానికిపైగా క్వారీలు స్థానిక వైసీపీ నేతల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా క్వారీలు నిర్వహిస్తున్నప్పటికీ గత ప్రభుత్వంలో అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అధికార పార్టీకి చెందిన కొందరు స్థానిక నేతలు వైసీపీ నేతలతో అంటకాగుతూ రాయి క్వారీలను సబ్‌లీజుకు తీసుకొని నడుపుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో మంత్రి అనుచరుడు ఒకరు గాజువాక కేంద్రంగా ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని మైనింగ్‌లో చక్రం తిప్పారు. పలు గ్రామాల్లో అనుమతి లేకుండా క్వారీలను ఏర్పాటు చేసి జేబులు నింపుకున్నారు. క్వారీల్లో వైసీపీ నేతల అక్రమాలపై అప్పట్లో టీడీపీ, జనసేన నాయకులు ఫిర్యాదులు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట పడుతుందని భావించారు. కానీ పరిస్థితిలో ఎటువంటి మార్పు కనిపించడంలేదు. వైసీపీకి చెందిన క్వారీల నిర్వాహకులతో కొందరు కూటమి నేతలు అంటకాగుతున్నారు. అనుమతి లేని క్వారీల నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చేసేందుకు లోపాకారి ఒప్పందాలు కుదుర్చుకొని మైనింగ్ అక్రమాలను కొనసాగిస్తున్నారు.

గతంలో సీజ్ చేసిన క్వారీల సంగతేంటి?

జిల్లాలో ఐదేళ్ల క్రితం 2020లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు జరిపి 28 క్వారీలను సీజ్ చేశారు. ఆయా క్వారీల నిర్వాహకులు హద్దులు దాటి మైనింగ్ చేసినట్టు అప్పట్లో విజిలెన్స్ బృందాలు నిర్ధారించి రూ.120 కోట్లకు పైగా జరిమానా విధించారు. అయితే కొన్ని క్వారీల ... మిగతా 8వ పేజీలో

పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ4 సర్వే

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):
పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టిన పీ4 సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ పీ4 సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడం, జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో వున్న 20 శాతం మందిని గుర్తించి పేదరికాన్ని దూరం చేయడం లక్ష్యమని తెలిపారు. ఇందుకు అనుగుణంగా ఈ నెల 8వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఇంటింటా సర్వే జరపాలని సూచించారు. ఈ సర్వే కారణంగా ప్రభుత్వ పథకాల అమలుపై ఎటువంటి ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. సర్వేలో పేర్కొన్న 27 ప్రశ్నలకు సమాధానాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో సీపీఓ రామారావు, వార్డు/ గ్రామ సచివాలయాల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర) 6.09
సహరి (శని) 4.56

పంట కాలువల్లో పూడిక

తుమ్మపాలలో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు

- పంటలకు నీరు అందక రైతుల ఇక్కట్లు
- గ్రామస్థులకు దుర్గంధం, దోమల బెడద
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



తుమ్మపాల వద్ద చెర్లోపలి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

తుమ్మపాల (అనకాపల్లి), మార్చి 6 (ఆంధ్రజ్యోతి):
శారదా నదిపై ఉన్న గ్రోయిన్ల ద్వారా తుమ్మపాల మీదుగా ప్రవహించే పంట కాలువలు చెత్తా చెదారాలతో నిండిపోయాయి. నీటి ప్రవాహం పూర్తిగా మందగించి, ఆయకట్టుకు నీరు సరిగా అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఒకవేళ పొలాలకు నీరు వచ్చినా.. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నల్లగా వుంటున్నది. పైగా దుర్వాసన వస్తున్నది. మరోవైపు తుమ్మపాలలో పంట కాలువల పక్కన నివసిస్తున్న వారు నిత్యం దుర్గంధం, దోమలు, ఈగల బెడదతో రోగాలబారిన పడుతున్నారు.

శారదా నదిపై తుమ్మపాల వద్ద గ్రోయిన్ వుంది. దీని నుంచి మూడు కాలువల (చెర్లోపలి కాలువ, నడిమి కాలువ, దీపాల కాలువ) ద్వారా సుమారు 2,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ కాలువలకు అనుబంధంగా వున్న అనకాపల్లి ఆవఖండంలో మరో రెండు వేల ఎకరాల ఆయకట్టు వుంది. మొత్తం మీద నాలుగున్నర వేల ఎకరాలకు ఈ కాలువల ద్వారా నీరు సరఫరా అందాలి. అయితే తుమ్మపాల గ్రామంలో నుంచి వెళుతున్న ఈ కాలువల్లో ఇరిగేషన్ అధికారులు నిర్వహణ పనులు చేపట్టలేదు. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోయాయి. నదిలో నీటి ప్రవాహం ఉధృతంగా వున్న సమయంలో కూడా ... మిగతా 8వ పేజీలో



ఇందిరానగర్ వద్ద చెత్తాచెదారాలతో నిండిపోయిన నడిమి కాలువ

కాలువల్లో చెత్తాచెదారం తొలగించాలి



చెర్లోపలి కాలువ కింద మాకున్న భూమిలో రబీలో మినుము పంట వేశాను. కాలువ నుంచి నీరు రాకపోవడంతో పాటు కొద్ది రోజుల నుంచి ఎండలు మండిపోతుం డడంతో పంట ఎండి పోతున్నది. కాలువల్లో పూడిక తీసి వుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఇరిగేషన్, పంచాయతీ అధికారులు స్పందించి పంట కాలువల్లో పూడికలు తీయించాలి.

కొణతాల మోదినాయుడు, రైతు, తుమ్మపాల

కొండగెడ్డను సర్వే చేసిన అధికారులు

రోడ్డు పనులు నిలిపి వేయాలని ఆక్రమణదారులకు నోటీసులు

- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కొండగెడ్డ కాలువను సర్వే చేస్తున్న తహసీల్దారు, ఇరిగేషన్ ఏ.ఈ.ఈ.



ఆక్రమించిన కొండగెడ్డ కాలువ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసిన రెవెన్యూ సిబ్బంది

పాయకరావుపేట రూరల్, మార్చి 6 (ఆంధ్ర.జ్యోతి):
మండలంలోని పి.ఎల్.పురం రెవెన్యూ పరిధి సర్వే నంబర్లు 111, 112లలో ఉన్న కొండగెడ్డను గురువారం రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు సర్వే నిర్వహించారు. 'కొండగెడ్డ కాలువ కబ్జా' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో అధికారులు స్పందించారు. కొండగెడ్డను ఆక్రమించి రోడ్డు నిర్మిస్తున్న ప్రాంతాన్ని తహసల్దారు జి.సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, నీటిపారుదల శాఖ ఏఈఈ జి.శ్రీరామ్మూర్తితో కలిసి సందర్శించారు. అనంతరం సర్వే చేయించి సరిహద్దులు నిర్ణయించారు. కొండగెడ్డ గెడ్డను ఆక్రమించి చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేయాలని నోటీసులు జారీ చేశారు. అనంతరం అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆర్.త్రినాథరావు, సర్వే విభాగం డీఐ బంగారుదేవి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీవీఎంసీ మేయర్‌పై అవిశ్వాసం?

కూటమి వ్యూహరచన

- కార్పొరేటర్ల సంతకాల ప్రారంభం
- ఈ నెల 18వ తేదీ నాటికి నాలుగేళ్ల పదవీకాలం పూర్తిచేసుకోనున్న గొలగాని హరివెంకటకుమారి
- ఆ తర్వాత ఏ క్షణమైనా అవిశ్వాస తీర్మానంపై జిల్లా కలెక్టర్‌కు నోటీసు ఇచ్చే అవకాశం
- ప్రస్తుతం కూటమికి 66 మంది మద్దతు



హరివెంకటకుమారి, మేయర్

విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ మేయర్ పీఠం దక్కించుకోవడానికి కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే ఏపీ మునిసిపల్ చట్టం ప్రకారం కనీసం నాలుగేళ్ల పదవీకాలం పూర్తికావాలి. ఈనెల 18వ తేదీ నాటికి మేయర్‌గా గొలగాని హరివెంకటకుమారి పదవీకాలం నాలుగేళ్లు అవుతుంది. దీంతో ఆమెను మేయర్ పీఠం నుంచి దింపేసి, కూటమి సభ్యుడిని మేయర్ పీఠంపై కూర్చోబెట్టాలని భావిస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజా ప్రతినిధులు, నేతలు పలుమార్లు సమావేశమై చర్చించారు.

జీవీఎంసీ ఎన్నికల సమయంలో 97వ వార్డు నుంచి పోటీ చేసిన పీలా శ్రీనివాస్‌ను టీడీపీ తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించింది. ఇప్పుడు ఆయన్నే మేయర్ పీఠంపై కూర్చోబెట్టాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఈనెల 18 తర్వాత అవిశ్వాసం ప్రవేశపెట్టే అవకాశం ఉండడంతో కూటమి కార్పొరేటర్ల నుంచి సంతకాల సేకరణ మొదలెట్టారు. అవిశ్వాస తీర్మానం పెట్టాలని జిల్లా కలెక్టర్‌కు నోటీస్ ఇవ్వాలంటే జీవీఎంసీలో ఓటు హక్కు కలిగిన సభ్యుల్లో సగం మంది సంతకం చేయాల్సి ఉంటుంది. జీవీఎంసీలో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉండగా, ఇద్దరు ఎంపీలు, ఒక రాజ్యసభ సభ్యుడు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు మొత్తం కలిపి 111 మంది ఓటు హక్కు కలిగిన సభ్యులు ఉన్నారు. వీరిలో 50 శాతం అంటే 56 మంది నోటీస్‌పై సంతకాలు చేయాల్సి ఉంటుంది. టీడీపీ, జనసేన, బీజేపీకి ఇప్పటికే 56 మంది కార్పొరేటర్లు, ఒక ఎంపీ, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ మొత్తం 66 మంది సభ్యులు ఉన్నారు. అందువల్ల అవిశ్వాస నోటీస్ ఇవ్వడానికి ఎటువంటి ఇబ్బందీ ఉండదు. ఇక కలెక్టర్‌కు ఇచ్చిన నోటీసుపై సంతకాలు చేసిన సభ్యుల సంతకాలను ధృవీకరిస్తూ మరో ఇద్దరు సభ్యులు సంతకం చేయాల్సి ఉంటుంది. అవిశ్వాస తీర్మానంపై నోటీస్ జిల్లా కలెక్టర్‌కు అందిన తర్వాత అందులో ఉన్న సంతకాలను పరిశీలించాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్‌కు పంపిస్తారు. కమిషనర్ ఒక్కో సభ్యుడి సంతకాన్ని పరిశీలించిన తర్వాత జిల్లా కలెక్టర్‌కు ... మిగతా 8వ పేజీలో

ఆహ్లాదమన్నారు..అధ్వానం చేశారు

▸ చెరువు పార్కు మధ్యలో రోజుల తరబడి నిలిచిన మురుగు ▸ దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న వాకర్స్ ▸ అసంపూర్తిగా పనులను చేసి వదిలేసిన అధికారులు



మురుగుతో కలుషితమైన సన్యాసమ్మ చెరువు పార్కు ప్రాంతం



పార్కులోని వాకింగ్ ట్రాక్‌పై నుంచి వాహనాల రాకపోకలు



పార్కులో నిర్వహణ లేక మరమ్మతులకు గురైన జిమ్ పరికరాలు

ఎలమంచిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించడమే మా బాధ్యత అంటూ చెరువును పార్కుగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో పట్టణ వాసులు కలుషితమైన నీటి దుర్వాసనతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై పట్టణవాసులు మండిపడుతున్నారు.

పట్టణంలోని త్రిమూర్తులు స్వామి ఆలయం వెనుక ఉన్న సన్యాసమ్మ చెరువును పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా పార్కుగా అభివృద్ధి పరిచేందుకు మునిసిపల్ పాలకులు, అధికారులు రెండేళ్ల క్రితం సంకల్పించారు. ఈ చెరువు గట్టును రూ.రెండు లక్షలతో పార్కుగా అభివృద్ధి చేయడంలో భాగంగా మొక్కలు నాటారు. వెంతనే జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసుకుని జిమ్ పరికరాలను వినియోగించుకుని వ్యాయామం చేసుకునేవారు. అయితే చెరువును పార్కుగా అభివృద్ధి చేయడంలో అధికారుల నిర్లక్ష్యం వహించడంతో ప్రస్తుతం అరకొర పనులు మాత్రమే అయ్యాయి.

వాకింగ్ ట్రాక్ చుట్టూ తుప్పలు పెరిగి పోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు బయటకు పోయేందుకు వీలు లేకపోవడంతో చెరువులో రోజుల తరబడి నీరు నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఈ పార్కు చుట్టూ దాతలు ముందుకు వచ్చి బెంచీలు ఏర్పాటు చేశారు. అలాగే విద్యుత్‌లైట్లు పూర్తి స్థాయిలో లేకపోవడంతో చీకటి పడితే కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. చెరువును పార్కుగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయకపోవడంపై పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.

వాకింగ్ ట్రాక్ చుట్టూ ఆధునీకీకరణ చేయకపోవడం, తుప్పలు తొలగించకపోవడం, క్రీడా కోర్టులు ఏర్పాటు చేయకపోవడం, విద్యుత్ లైట్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకపోవడం, జిమ్ పరికరాల నిర్వహణ పట్ల శ్రద్ధ వహించలేదు. పార్కును అన్ని విధాలుగా ఆహ్లాదాన్ని పంచేలా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

పార్కును అభివృద్ధి చేయాలి

▸ ఈ. శ్రీనివాస్, ఉద్యోగి, ఎలమంచిలి



ప్రతి రోజూ వాకింగ్, వ్యాయామం చేసుకునేందుకు ఈ పార్కుకు వస్తుంటాను. వాకింగ్ తోపాటు జిమ్ పరికరాలను వాకర్లు ఉపయోగించుకుంటున్నారు. వర్షపు నీరు మధ్యలో నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోంది. నీరు నిలిచిపోకుండా మరిన్ని సదుపాయాలు కల్పించినట్టయితే మరింత బాగుంటుంది.

అన్ని విధాలా ఆధునీకరించాలి

▸ నక్కా శివశంకర్. కూటమి నేత



ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న పార్కును పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా పూర్తి స్థాయిలో సదుపాయాలతో ఆధునీకరించాలి. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా మరిన్ని సదుపాయాలు కల్పించాలి. అలాగే పర్యవేక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

'పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి'

పాయకరావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ గృహాలకు 100 యూనిట్ల వరకు ఉచితంగా అందించే పథకాన్ని ప్రభుత్వం రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలను ఎన్డీఏ ప్రభుత్వం నేటికీ చెల్లించకపోవడం సరైనదికాదన్నారు. దళితవాడల సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, గత ప్రభుత్వ హయాంలో రద్దయిన 27 దళితుల సంక్షేమ పథకాలను ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం పునరుద్ధరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

8న పి4 సర్వే ప్రారంభం

ఎలమంచిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజం లక్ష్యంగా పీ 4 సర్వే(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్ షిప్) కార్యక్రమం ఈనెల 8 వ తేదీన ప్రారంభం కానుందని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు గురువారం తెలిపారు. సచివాలయ సిబ్బంది ద్వారా రెండు రోజులుపాటు మండలస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. సర్వేను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'పేదరికం లేని సమాజమే పీ4 సర్వే లక్ష్యం'

కోటవురట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పేదరికంగా లేని సమాజ స్థాపనే లక్ష్యంగా పీ4 సర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఈవోపీఆర్‌డీ రఘురామ్ సూచించారు. గురువారం స్థానిక మండలపరిషత్ సమావేశమందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పీ4 యాప్ నమోదుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ముందుకు వెళుతుందన్నారు. పేదల అవసరాలను గుర్తించి వారి సమగ్ర అభివృద్ధికి కృషిచేయాలన్నారు. విజన్ 2047 కార్యక్రమంలో భాగంగా ఈ సర్వేను చేపడుతున్నట్టు తెలిపారు. రెండో విడత ఈ సర్వేను ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభవుతుందన్నారు. ఇంటింటికి తిరిగి పేదల ఆర్థిక, సామాజిక రంగాల్లో తీసుకు వచ్చే విధంగా పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ సర్వే నిర్వహించాలని ఆయన సచివాలయ సిబ్బందికి సూచించారు.

ఇన్‌స్పైర్ మనక్‌కు జంపపాలెం విద్యార్థులు



ఇన్‌స్పైర్‌కు ఎంపికైన విద్యార్థులు

ఎలమంచిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బల్లా వెంకటేష్, ముత్యాల మోహన్ సాయి ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికైనట్టు హెచ్‌ఎం శాస్త్రి గురువారం తెలిపారు. డస్ట్‌బిన్ మానిటరీ సిస్టమ్‌ను మోహన్ సాయి, కార్ యాక్సిడెంట్ ప్రివెన్షన్ సిస్టమ్‌ను వెంకటేష్ రూపొందించారని తెలిపారు. వీరిద్దరూ సైన్స్ ఇన్‌స్పైర్ కార్యక్రమంలో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

ఉపమాక వెంకన్న ఉత్సవాలకు ఏర్పాట్లు షురూ



ఉపమాక ఆలయ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న విశాలమైన షెడ్డు

నక్కపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు ఊపందుకున్నాయి. 9వ తేదీ నుంచి ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమవుతాయి. ఆలయ ఆవరణలో భక్తులు సేదతీరేందుకు, ఎండ తగలకుండా విశాలమైన షెడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ గర్భగుడి చుట్టూ పెండాల్స్ ఏర్పాటు చేశారు. నక్కపల్లి, అడ్డరోడ్డు, మనబాలవానిపాలెం, పాయకరావుపేట, నర్సీపట్నం రోడ్డు పరిసర ప్రాంతాల్లోని పలు జంక్షన్లలో వెంకన్న ఉత్సవాల స్వాగత బోర్డులు, ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవ ఏర్పాట్లపై హోం మంత్రి అనిత టీడీపీ నాయకులు వెంకటేశ్, కొప్పిశెట్టి బుజ్జితో మాట్లాడి తెలుసుకుంటున్నారు.



ఆలయ ప్రాకారంలో ఏర్పాటు చేసిన పెండాల్స్

బందోబస్తు ఏర్పాట్లు డీఎస్పీ పరిశీలన



ఉపమాక వెంకన్న ఉత్సవాల బందోబస్తు ఏర్పాట్లను పరిశీలన చేస్తున్న డీఎస్పీ పి.శ్రీనివాసరావు

నక్కపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపమాక వెంకన్న ఉత్సవ ఏర్పాట్లను గురువారం సాయంత్రం నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఉపమాక ఆలయాన్ని ఆయన సందర్శించారు. స్వామివారి తిరువీధి సేవలు, జరిగే మాడవీధుల్లో ఆలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న క్యూ లైన్లు, స్వామివారి పుష్కరిణి వద్ద భద్రతా చర్యలపై ఆయన స్థానిక పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం నక్కపల్లి ,అడ్డరోడ్డు సీఐలు కె.కుమారస్వామి, ఎల్.రామకృష్ణ, ఎస్ఐలు సన్నిబాబు, విభీషణరావులకు పలు ఆదేశాలు జారీ చేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్ కూడా డీఎస్పీ శ్రీనివాసరావు చర్చించారు.

ఉత్సవాల రమ్మని అధికారులకు ఆహ్వానాలు



ఆర్డీవో రమణకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న దృశ్యం

నక్కపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9 నుంచి జరగనున్న ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలకు రావల్సిందిగా పలువురికి గురువారం ఆహ్వానపత్రికలను అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, టీడీపీ నాయకులు వెంకటేశ్, కురందాసు నూకరాజు, లక్ష్మణరావు, తోలేటి శ్రీను తదితరులు నర్సీపట్నం ఆర్డీవో రమణ, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు,హెటిరో ప్రతినిధులు, పలుశాఖల అధికారులకు ఆహ్వానాలు అందజేశారు.


కారిడార్ భూములను పరిశీలించిన ఏపీఐఐసీ చైర్మన్

నక్కపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూములను ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, నిర్వాసిత రైతులతో కలిసి సమస్యలను వివరించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం 18 ఏళ్ల వయస్సు నిండిన వారికి రూ. 25 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని, సాగు భూములకు నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు నిర్వాసితులందరికీ న్యాయం జరిగే వరకూ ఎటువంటి పనులు చేపట్టకూడదని అప్పలరాజు చెప్పారు. బల్క్‌డ్రగ్ యూనిట్ నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేయకూడదన్నారు. కారిడార్ నిర్వాసిత రైతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఏపీఐఐసీ చైర్మన్ చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎం,.సత్యనారాయణ పాల్గొన్నారు.



ఏపీఐఐసీ చైర్మన్ రామరాజుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేత అప్పలరాజు

ఘనంగా నల్లమారెమ్మ పండగ



గొర్లెధర్మవరంలో జరిగిన ఎడ్ల బండ్ల పరుగు పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

అచ్యుతాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలలోని గొర్లెధర్మవరంలో నల్లమారెమ్మ పండగ గురువారం ఘనంగా జరిగింది. గొర్లెధర్మవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు మొక్కుబడులను తీర్చుకున్నారు. తల నీలాలు సమర్పించి అగ్నిగుండాన్ని తొక్కారు. ఈసందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మంచి నీరు. మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు.

ఎడ్ల బండ్ల పరుగు పోటీల విజేత వాయిలపాడు

మండలంలోని గొర్లె ధర్మవరం నల్లమారెమ్మ పండగ సందర్భంగా గురువారం ఏర్పాటుచేసిన ఎడ్ల బండ్ల పరుగు పోటీల్లో విజయనగరం జిల్లా వేపాడ మండలం వాయిల పాడుకి చెందిన పరదేశమ్మ ఎడ్లబండి ప్రథమ స్థానం, మరిడిమాంబ ఎడ్లబండి ద్వితీయ స్థానం, దేవరాపల్లికి చెందిన జైవీరంజనేయ ఎడ్ల బండి తృతీయ స్థానం , చీడికాడ మండలం చీకపల్లికి చెందిన పోమలమ్మతల్లి ఎడ్లబండి నాల్గో స్థానం, చీడికాడ మండలం వల్లంపూడికి చెందిన సిద్ధి వినాయక ఎడ్లబండి ఐదో స్థానం సాధించాయి. కార్యక్రమంలో గొర్లె నూకరాజు, రామజోగి. నర్సింగరావు, వెంకట కృష్ణ, అప్పారావు, నారిపల్లి సన్యాసి నాయుడు, జెర్రిపోతుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గేటు పడితే గంటల కొద్దీ నిరీక్షణ

▸ పెదపల్లి, ఏటికొప్పాక వాసుల ఆవేదన



పెదపల్లి రైల్వే గేటు వద్ద తప్పని నిరీక్షణ

ఎలమంచిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో పలుచోట్ల రైలుగేట్లు పడుతున్న సమయంలో స్థానిక గ్రామాల ప్రజలకు నిరీక్షణ తప్పడం లేదు. పట్టణంలోని పెదపల్లి రైలుగేటుతోపాటు, మేజర్ పంచాయతీ ఏటికొప్పాక రైలుగేటు వద్ద రైళ్ల రాకపోకల కోసం తరచూ గేట్లు పడుతున్న సమయంలో ప్రజలు ఆగిపోవాల్సి వస్తున్నది. పెదపల్లి రైలు గేటు మీదుగా వేలాది మంది రామ్‌నగర్, ఏఎస్ఆర్ కాలనీ, పెదపల్లి, గొల్లలపాలెం, మంత్రిపాలెం, చినగొల్లలపాలెం వార్డులకు చెందిన వేలాది మంది ప్రజలు ఎలమంచిలికి రాకపోకలు సాగిస్తుంటారు. రాకపోకలు సాగిస్తున్న సమయంలో పెదపల్లి రైలుగేటు పడుతున్న కారణంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, పరిశ్రమలకు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు, చిరు వ్యాపారులు, ప్రజలు ఈ గేటు వద్ద తీవ్ర అసహానానికి గురికావాల్సి వస్తుంది. పెదపల్లి రైలు గేటు వద్ద ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని గత వైసీపీ ప్రభుత్వం హయాంలో స్థానికులు అప్పటి నేతలను పలుమార్లు కోరుకున్నా సరే ప్రత్యామ్నాయ చర్యలు మాత్రం చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి రావడంతోనే ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రత్యేక చొరవ చూపి పెదపల్లి రైలుగేటు వద్ద ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో రైల్వే అధికారులు వచ్చి పరిశీలన చేశారు. అదేవిధంగా ఏటికొప్పాక రైలుగేటు వద్ద చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించారు. దీంతో సమీప గ్రామాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే ఈ రెండు చోట్ల ప్రత్యామ్నాయ చర్యలను వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్



చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాయకరావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల సందర్భంగా పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సందర్శన కోసం వచ్చిన స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థినులకు పోలీసుల విధులు, చట్టాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా స్టేషన్‌లో వివిధ విభాగాలు, పోలీసులు వినియోగించే ఆయుధాలను వివరించారు. ఈ సందర్భంగా సీఐ జి.అప్పన్న విద్యార్థినులతో మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణకు పోలీసు శాఖ ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆపద సంభవించినపుడు పోలీసులకు సమాచారం ఇచ్చి రక్షణ పొందాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలి



సత్యవరంలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ

పాయకరావుపేట రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో తడి, పొడి చెత్తలను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖరరావు అన్నారు. మండలంలోని పెదరాంభద్రపురం, నామవరం. సత్యవరం పంచాయతీలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా నిర్దేశిత ప్రదేశాలలో వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులు శత శాతం వసూలు చేయాలన్నారు. అనంతరం సంపద తయారీ కేంద్రాలను సందర్శించారు. ఇక్కడ తయారయిన వర్మీ కంపోస్టును రైతులు కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు మల్లికార్జునాచారి, దుర్గాప్రసాద్, నాయుడు, సర్పంచ్ సఖిలేటి రాము, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవంలో భజన చేస్తున్న భక్తులు

ఎలమంచిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ ఏటికొప్పాకలో గురువారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 22వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర విశ్వబ్రాహ్మణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక భజన కీర్తనలు ఆలపించారు. అనంతరం స్వామివారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా అన్నసమరాధన ఏర్పాటు చేశారు.

ఒడ్డిమెట్ట వద్ద కెమికల్ ట్యాంకర్ బోల్తా



బోల్తా పడిన ట్యాంకర్

నక్కపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒడ్డిమెట్ట హైవేపై గురువారం కెమికల్ లోడ్ ట్యాంకర్ బోల్తా పడింది. తుని వైపు నుంచి పరవాడకి ఎసోటోన్ కెమికల్ లోడుతో వెళుతున్న ట్యాంకర్ లారీ ఒడ్డిమెట్ట వద్ద బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తూ ట్యాంకర్ నుంచి కెమికల్ లీకు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న సీఐ కుమారస్వామి సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో కానిస్టేబుల్ మృతి



చత్రియ విజయరామ్ సింగ్ (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న చత్రియ విజయరామ్‌సింగ్(38) బ్రెయిన్ స్ట్రోక్ తో మృతిచెందారు. రెండ్రోజుల క్రితం అనారోగ్యంతో రాజమహేంద్రవరంలోని కిమ్స్ ఆస్పత్రిలో చేరిన ఆయన ఆరోగ్యం విషమించడంతో గురువారం ఉదయం మృతిచెందారు. గత రెండున్నరేళ్లుగా పాయకరావుపేటలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామ్‌సింగ్‌కి భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, ఆయన స్వస్థలం విశాఖపట్నంలోని పైనాపిల్ కాలనీ. మృతదేహాన్ని విశాఖపట్నం తరలించగా సీఐ జి.అప్పన్న, ఇతర పోలీసు సిబ్బంది విశాఖపట్నంలోని మృతుడి ఇంటికి వెళ్లి పార్థివదేహం వద్ద నివాళి అర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఫోన్లో విజయరామ్‌సింగ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయంగా ప్రభుత్వం అందజేసిన లక్ష రూపాయలను మృతుడి కుటుంబ సభ్యులకు సీఐ జి.అప్పన్న అందజేశారు. విజయరామ్‌సింగ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

వమ్మవరంలో రేషన్ బియ్యం పట్టివేత

రావికమతం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరంలో రేషన్ బియాన్ని గురువారం రాత్రి ఆర్ఐ పట్టుకున్నారు. మత్రివలసకు చెందిన వ్యక్తి ఇంటింటా రేషన్ బియ్యం కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుంటారు. వమ్మవరంలో ఒక పెంకుటింటి వరండాలో బియ్యం మూటలను నిల్వ చేసి టార్పా కప్పారు. గురువారం రాత్రి ఆ బియ్యాన్ని అక్కడి నుంచి తరలించేందుకు సిద్ధం చేస్తుండగా స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆర్ఐ సతీష్ బియ్యం మూటలను పరిశీలించారు. రేషన్ బియాన్ని నాలుగు మూటల్లో వంద కేజీలే ఉన్నాయని, మిగిలినవి రైతులకు చెందిన మినుముల మూటలని ఆర్ఐ తెలిపారు. నాలుగు మూటల బియాన్ని స్వాధీనం చేసుకోని ఎండీయూ నిర్వహకుడికి అప్పగించామని తెలిపారు. బియ్యం అక్రమ తరలింపుపై 6ఎ కేసు సీఎస్ డీటీ నమోదు చేయాల్సి ఉందన్నారు.


తాళ్లపాలెం ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

లక్ష్య సాధనకు వైద్య సిబ్బంది కృషిచేయాలి

▸ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవికుమార్

కశింకోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో లక్ష్యాల సాధనకు వైద్య సిబ్బంది కృషి చేయాలని అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్ సూచించారు. గురువారం తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల కోసం నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న వ్యాక్సిన్ల కోల్డ్‌చైన్ నిర్వహణ, మందుల స్టోర్స్ రికార్డులను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముందుగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వీఏ.సుబ్బారావు, హెల్త్ ఎడ్యుకేటర్ ఎంఎస్‌వీ.ప్రసాద్, నరసింహారావు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురుకులం శాశ్వత భవన నిర్మాణానికి కృషి

అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

తుమ్మపాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల శాశ్వత భవన నిర్మాణానికి కృషి చేస్తానని అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం రాత్రి గురుకుల పాఠశాలలో జరిగిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గురుకుల పాఠశాల శాశ్వత భవన నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వ హయాంలో రూపకల్పన జరిగిందని, దురదృష్టవశాత్తూ ప్రభుత్వం మారడంతో ఈ ప్రక్రియ మూలకు చేరిందని చెప్పారు. ప్రస్తుతం ఉమ్మడి ప్రభుత్వ పాలనలో గురుకుల పాఠశాల శాశ్వత భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జామినేషన్ కమిషనర్ ఎ.శ్రీధర్ రెడ్డి, ఓపెన్ స్కూల్ ఇన్‌చార్జి కృష్ణంరాజు, నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, బొడ్డేడ మురళీ, పాఠశాల ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కర్రి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి


కేజీబీవీలో ఇంటర్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో రవీంద్రబాబు

సబ్బవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంఈవో-2 ఎంజే.రవీంద్రబాబు సూచించారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పలు రకాల ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాల సిబ్బందితో మాట్లాడి పది పరీక్షలకు విద్యార్థులను ఏ విధంగా సన్నద్ధం చేస్తున్నదీ అడిగి తెలుసుకున్నారు. వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఆహ్లాదకర వాతావరణంలో ఎటువంటి ఆందోళనకు గురికాకుండా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. హాల్ టికెట్లపై ఎటువంటి పొరపాట్లు ఉన్నా సంబంధిత ఎస్‌వోకు తెలియచేయాలని సూచించారు. ఐదు పరీక్షా కేంద్రాలకు సంబంధించిన స్టేషనరీ ఎంఆర్‌సీకి చేరుకుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో మృదుల, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నూకాంబిక జాతర రాట ముహూర్తం


తాకాశవీధిలో రాట ముహూర్తం చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర సందర్భంగా గురువారం రాట ముహూర్తం నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల మధ్య జాతర ఏర్పాట్లకు సంబంధించి రాట ముహూర్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాజసులోచన, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తాకాశి కన్నబాబు, తాకాశి కొండలరావు, బేతి ఈశ్వరరావు, బోయిన వరహాలు, తాడి రామకృష్ణ, తాకాశి సూర్యారావు, వీధి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు


రిలే నిరాహార దీక్షల్లో కూర్చొన్న కార్మికులు

అనకాపల్లి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ ఎన్ఎంయూఏ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం కొనసాగాయి. అక్రమంగా సస్పెన్షన్ చేసిన డ్రైవర్, కండక్టర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, సీఅండ్‌టీ కేసుల్లో పాయింట్ల విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ దీక్షల్లో ఐవీ.శ్రీను, జి.గోవింద, సీహెచ్.ఆర్.లక్ష్మి, గిరి కూర్చొన్నారు. వీరికి యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు.

భారీ గొయ్యి.. ఆదమరిస్తే అంతేనోయి!

▸ ప్రమాదభరితంగా అనకపల్లి బైపాస్ రోడ్డు

▸ భయాందోళనలో వాహన చోదకులు


అనకపల్లి ఎస్సీ కాలనీ వద్ద రహదారి పక్కన తవ్వి వదిలేసిన భారీ గొయ్యి

సబ్బవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనకపల్లి బైపాస్ నుంచి మండల కేంద్రం సబ్బవరం మీదగా వెళ్లే జాతీయ రహదారిలో ఎస్సీ కాలనీ వద్ద భారీ గొయ్యి వాహన చోదకులను బెంబేలెత్తిస్తోంది. గతంలో అక్కడ కల్వర్టు ఉండేది. ఇటీవల రోడ్డు పక్క నుంచి డ్రైనేజీ నిర్మించారు. అయితే సదరు కల్వర్టు ద్వారా నీరు పోయేలా డ్రైనేజీ కాలువను కనెక్ట్ చేసే ప్రయత్నంలో భారీగా గొయ్యి తవ్వారు. తర్వాత ఏమైందో తెలియదుగానీ, గుంతను మాత్రం అలానే వదిలేశారు. ఈ గొయ్యి నిండా నీరు నిండిపోయి ఉంది. సదరు నీరు ప్రవహించే మార్గం లేకపోవడంతో, ఆలాగే నిలిచి నిల్వ ఉండిపోయి ప్రయాణికులను భయపెడుతోంది. వాహనాలు అదుపుతప్పితే నేరుగా వెళ్లి గోతిలో పడితే భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రయాణికులు, వాహన చోదకలు, స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ గొయ్యిని పూడ్చిపెట్టాలని వారు కోరుతున్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన జిల్లా టీడీపీ నేతలు



సీఎం చంద్రబాబుకు బొకే అందిస్తున్న బుద్ద జగదీశ్.. నూకాంబిక అమ్మవారి చిత్రపటం అందిస్తున్న సురేంద్ర

అనకాపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడును విశాఖపట్నంలో జిల్లాకు చెందిన పలువురు టీడీపీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ సందర్భంగా విచ్చేసిన సీఎం చంద్రబాబుకు మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు పూలబొకే అందించి స్వాగతం పలికారు. అలాగే గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. అనకాపల్లి నూకాంబిక దేవస్థానం అభివృద్ధికి నిధులు కేటాయించిన సీఎం చంద్రబాబుకు నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని సురేంద్ర అందజేశారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, వెలమ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎరువుల తయారీపై ప్రత్యేక దృష్టిసారించండి

▸ జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి


వాడచీపురుపల్లిలో ఇళ్ల నుంచి చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

పరవాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో సేకరించిన చెత్త నుంచి ఎరువులు తయారు చేయడంపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా పంచాయతీ అధికారిణి (డీపీవో) ఆర్.శిరీషారాణి సూచించారు. మండలంలోని కలపాక, రావాడ, వాడచీపురుపల్లి పంచాయతీల్లో గురువారం ఆమె పర్యటించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ సిబ్బందితో డీపీవో మాట్లాడుతూ కలపాకలో సిద్ధం చేసిన 160 కిలోల వర్మీ కంపోస్ట్ ఎరువును విక్రయించాలని సూచించారు. వాడచీపురుపల్లి, రావాడలలో కూడా ఎరువు తయారీపై సన్నద్ధమవ్వాలన్నారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. అలాగే తయారు చేస్తున్న ఎరువును విక్రయించి, తద్వారా వచ్చే నగదుతో పంచాయతీ అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని కార్యదర్శులకు ఆదేశించారు.

అనంతరం ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఆమె వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ధర్మారావు, సమిత్వ జిల్లా కో-ఆర్డినేటర్ కె.కరుణాకర్, పంచాయతీ కార్యదర్శులు త్రినాథరావు, అనురాధ, అచ్యుతరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూములు ఇచ్చిన రైతులకు టీడీఆర్ బాండ్లు

▸ అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా


పైడివాడఅగ్రహారంలో రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో షేక్ ఆయిషా

సబ్బవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అనకపల్లి-లంకెలపాలెం రోడ్డులో పైడివాడఅగ్రహారం నుంచి కోడూరు ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ పార్కు వరకూ వంద అడుగులు రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవెలప్‌మెంట్ రైట్స్) జారీ చేస్తామని అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా తెలిపారు. గురువారం గ్రామంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అధ్యక్షతన రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా కోడూరు వరకూ 100 అడుగులు రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా రోడ్డు నిర్మాణానికి రైతులు వద్ద నుంచి భూమి సేకరణకు రైతులు సహకరించాలని కోరారు. ఈ రోడ్డు 2.68 కిలోమీటర్ల మేర 100 అడుగులు వెడల్పుతో నిర్మాణం జరుగుతుందన్నారు. అందుకు 12.263 ఎకరాలు అవసరం అవుతుందని, ఆ మేరకు రైతులు నుంచి భూమిని సేకరించడం జరుగుతుందని ఆర్డీవో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వో దేవుడుబాబు, ఎంపీటీసీ సభ్యుడు సీరం అప్పలరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎ.రామలక్ష్మి, దుర్గినాయుడు, రైతులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళా లబ్ధిదారులకు కుట్టుమిషన్ శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బీసీ కార్పొరేషన్ ఈడీ పెంటోజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్న మహిళలు ఇందుకు అర్హులన్నారు. శిక్షణ కోసం దరఖాస్తుదారులు వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. తెల్లరేషన్‌కార్డు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్టు చెప్పారు. మరిన్ని వివరాల కోసం తమ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రజా సమస్యలపై ప్రజా చైతన్యయాత్రలు

అనకాపల్లి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై ఈ నెల 8వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా చైతన్యయాత్రలు నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా 8న జిల్లా వ్యాప్తంగా ప్రజా చైతన్యయాత్రలు నిర్వహిస్తామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల హక్కుల కోసం ఈ యాత్రలో గళం విప్పుతామని చెప్పారు. యాత్రలో గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24, 25 తేదీల్లో మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

8న ప్రత్యేక వైద్య శిబిరం

అనకాపల్లి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గౌరీ గ్రంథాలయ 83వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 8న గ్రంథాలయంలో న్యూరో వ్యాధికి సంబంధించి ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు 'నేర్చుకోవడం-జ్ఞాపకశక్తి' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఆయన చెప్పారు

డొంకాడకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

అనకాపల్లి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కె.యల్లవరం పంచాయతీ డొంకాడ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఒక లేఖలో కోరినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు తెలిపారు. ఈ గ్రామంలో 29 కుటుంబాలు, 150 మంది జనాభా జీవనం సాగిస్తున్నారన్నారు. కరక ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి డొంకాడ గ్రామానికి కేవలం కిలోమీటరు దూరం మాత్రమే ఉందన్నారు. గత ప్రభుత్వం రూ.1.35 కోట్లు మంజూరు చేసిందని, అటవీ అనుమతులు లేవని రోడ్డు పనులు ప్రారంభించలేదని, దీతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అలాగే పిల్లలు చదువుకు దూరమవుతున్నారన్నారు. అందువల్ల డొంకాడ గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని కలెక్టర్‌ను లేఖలో కోరినట్లు కోటేశ్వరరావు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పరవాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొని వివిధ చిత్రాలను గీశారు. విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేస్తామని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

కశింకోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని కశింకోట పోలీసు స్టేషన్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మనోజ్‌కుమార్ విద్యార్థినులకు పోలీసు వ్యవస్థ, చట్టాలు, బాలికలు, మహిళల భద్రతకు సంబంధించి అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే హెల్ప్‌లైన్ 100, 112, 181, 1098 నంబర్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు స్టేషన్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9న పసిడి కలశ ప్రతిష్ఠా మహోత్సవం

సబ్బవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పునర్నిర్మించిన శ్రీరామలింగేశ్వర, ఉమాదేవి, లక్ష్మీగణపతి, శ్రీనందీశ్వర, చండీశ్వర శిలా విగ్రహ సహిత పసిడి కలశ ప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 9న నిర్వహించేందుకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా 7న మధ్యాహ్నం విగ్రహాలు, పసిడి కలశల గ్రామ తిరువీధి ఉత్సవం జరుగుతుందన్నారు. 8న ఉదయం 7 గంటల నుంచి వేద పారాయణ, పంచగవ్యప్రాశన, జలాదుద్ధరణ, క్షీరాధివాసం, నిత్య హోమాలు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 5.30 గంటల నుంచి వాస్తు పూజ, జీవ కల్యాణ హోమం, 9న ఉదయం 10.54 గంటలకు విగ్రహ, పసిడి కలశ ప్రతిష్ఠా మహోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని వారు చెప్పారు.

2027 నాటికి మలేరియా నిర్మూలన

▸ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ సుబ్రహ్మణేశ్వరి

అనకాపల్లి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మలేరియా జ్వరాలను 2027 నాటికి పూర్తిగా తగ్గించేందుకు కృషి చేయాలని పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ సుబ్రహ్మణేశ్వరి సూచించారు. స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గురువారం జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో పని చేస్తున్న వైద్యాధికారులకు ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, బోదకాలు, చికెన్‌గున్యా వంటి వ్యాధుల నివారణపై చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమెను వైద్యాధికారులు సత్కరించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో పి.రవికుమార్, జిల్లా మలేరియా నివారణ అధికారి కె.వరహాలదొర, జోనల్ మెడికల్ ఆఫీసర్ శాంతిప్రభ, డాక్టర్ ప్రసాదరావు, కె.చంద్రశేఖర్, ఎంఎస్‌వీకే.బాలాజీ, జె.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటుచేయాలి

అనకాపల్లి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యాలయంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని బీఎస్పీ నేత సూదికొండ మాణిక్యాలరావు కోరారు.ఈ మేరకు గురువారం వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనకాపల్లిలో డయాలసిస్ సెంటర్ లేకపోవడం వల్ల డయాలసిస్ రోగులు దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల బాధితులు వ్యయప్రయాసాలకు గురవుతున్నారని వాపోయారు. స్థానికంగా డయాలసిస్ యూనిట్ ప్రజలకు అందుబాటులో ఉంటే బాధితులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. దీనిపై డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే వైద్యాలయంలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయన్నారు. పది పడకలతో పనులు జరుగుతున్నాయని, త్వరలోనే అందుబాటులోకి వస్తుందని ఆయన వివరించారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు

అనకాపల్లి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ బి.యమున చెప్పారు. స్థానిక గవరపాలెం బాలికోన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ నిర్వహించిన పదో తరగతి మోడల్ నమూనా పరీక్ష విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని, దాని సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఎవరైనా అల్లరిమూకలు ఏడిపించినట్లయితే మహిళా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో నెలకొన్న భయాందోళన పోవడానికి ఇటువంటి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నమూనా పరీక్షలో కె.ఉమాదేవి, బి.మోహిత్, వి.రాజదీప్, కె.శృతి, పి.భాగ్యఅనన్య, డి.మోక్షిత, ఎస్.రేవతి, బి.పావని, పి.వంశీకృష్ణ, ఎం.జగదీశ్ ఒకటి నుంచి పది బహుమతులు దక్కించుకున్నారు. వీరికి ఎస్ఐ యమున బహుమతులు అందజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.బాలాజీ, ఎం.నూకరాజు పాల్గొన్నారు.

'గొంతిన శివపై అక్రమ కేసులు బనాయించడం తగదు'

కశింకోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరవాడపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నేత గొంతిన శివపై అక్రమ కేసులు బనాయించడం తగదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మలసాల కిశోర్ అన్నారు. ఈ మేరకు గురువారం ఎస్ఐ మనోజ్ కుమార్‌ను కలిసి మాట్లాడారు. ఈ కేసులపై పూర్తి స్థాయి విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు కె.గున్నయ్యనాయుడు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

తుమ్మపాల శివాలయం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

తుమ్మపాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ తుమ్మపాలలో శివాలయం నుంచి బొజ్జన్నకొండ వరకు వెళ్లే రహదారి నిర్మాణానికి గురువారం ఎంపీపీ గొర్లి సూరిబాబు, నాయకులు కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం, ఎంపీపీ నిధులు రూ.70 లక్షలతో 1400 మీటర్ల పొడవున రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్టు చెప్పారు. దీంతో తుమ్మపాలలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్య పరిష్కారమవుతుందన్నారు. బొజ్జన్నకొండ వరకు రాకపోకలు సాగించే రైతులు, పర్యాటకులకు ఈ రోడ్డు ఎంతగానో అనుకూలంగా ఉంటుందన్నారు. తుమ్మపాలలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, పంచదార్ల కన్నారావు, నాయకులు పీలా తాతునాయుడు, పీలా విశ్వేశ్వరరావు, బి.రామ్‌కుమార్, ఆర్.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ పోలిరెడ్డిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, దోసూరు, తిక్కవానిపాలెం పంచాయతీల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తుమ్మపాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆప్కాస్‌ను రద్దు చేసి కాంట్రాక్టర్లకు అప్పగిస్తామనడం దారుణమన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని, రూ.26 వేలు వేతనాన్ని ఇవ్వాలని కోరారు. ఇందుకోసం ఈ నెల 11న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్మిక సంఘం నాయకులు ఎం.నరసింహమూర్తి, బి.రవికుమార్, వై.అప్పలరాజు, సుమన్, సింగంపల్లి అజయ్ పాల్గొన్నారు.

సారాకు దూరంగా ఉండాలి



సారాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ ఆచారి

పాడేరురూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, అమ్మకాలను ప్రజలు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ టీవీవీఎస్ఎన్ ఆచారి కోరారు. సారా రహిత రాష్ట్రంగా మార్చేందుకు నవోదయం - 2 కార్యక్రమంలో భాగంగా మండలంలోని అల్లివరం, జోడిమిమడి, కాంద్రంగిపాడు పీవీటీజీ గ్రామాల్లో గురువారం గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నవోదయం విజయవంతానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో సారా తయారీ, అమ్మకాలను సంపూర్ణంగా నిషేధించి గ్రామాల అభివృద్ధికి యువత ముందుకు రావాలని కోరారు. సారాతో అనర్థాలను కళాజాత బృందాల ద్వారా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ హనుమంతరావు, సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

'గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి'



డ్వాక్రా సభ్యులకు ఇచ్చిన నోటీసు చూపుతున్న సర్పంచి త్రినాథ్

ముంచంగిపుట్టు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూప్‌నకు తప్పుడు లెక్కలతో నోటీసులు జారీ చేసిన ముంచంగిపుట్టు గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని లక్ష్మీపురం సర్పంచి కె.త్రినాథ్ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన పంచాయతీ పరిధిలోని కర్లాపొదర్ కు చెందిన మదర్‌థెరిసా ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌నకు గత ఏడాది రూ.1. 60లక్షలు మంజూరైనట్టు చెప్పారు. అయి తే, అప్పట్లో గ్రామీణ వికాస్ బ్యాంక్ అధికారులు కేవలం రూ.90 వేలు మాత్రమే గ్రూపునకు డ బ్బులు ఇచ్చారు. తిరిగి సభ్యులు సుమారు రూ.66 వేలు రుణం చెల్లించారన్నారు. కేవలం గ్రూప్ సభ్యు లు రూ.24 వేలు మాత్రమే బకాయి ఉన్నారు. బ్యాంక్ మేనేజర్ గ్రూప్ సభ్యులు రూ.89. 642 బకాయి ఉన్నట్టు నోటీసులు ఇచ్చారన్నారు. రుణం చెల్లించినా ఇంత మొత్తంపై నోటీసులు ఎలా జారీ చేశారని మే నేజర్‌ను ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెబుతున్నారన్నారు. పైస్థాయి అధికారులు స్పందించి విచారణ చేపట్టి మహిళలకు న్యాయం చేయాలని కోరారు.

ఉద్యోగులకు క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

పాడేరురూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి పి.ఝాన్సీరాణి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు కబడ్డీ, మ్యూజికల్ చైర్, డిబెట్, వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించారు. విజేతలకు 8వ తేదీన బహుమతులను పంపిణీ చేస్తామని సీడీపీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్, మహిళా ఉద్యోగులు,పోలీసులు, చిల్డ్రన్ హోమ్ సిబ్బంది, ఐసీడీఎస్ సైపర్ వైజర్లు, స్కూల్ టీచర్స్, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

'చర్చిల అనుమతులపై విచారణకు ఉత్తర్వులు తగవు'

పాడేరురూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చర్చిల అనుమతులపై విచారణ ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న క్రైస్తవ చర్చిలకు అనుమతులు ఉన్నవి, లేనివి సమగ్ర విచారణ జరిపి అనుమతులు లేని వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది క్రైస్తవుల పట్ల మత వివక్షతను పాటించడమే అవుతుందన్నారు. అందువల్ల ఈ ఉత్వర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

డుంబ్రిగుడలో ఏకలవ్య పాఠశాల

- వేసవి సెలవుల అనంతరం ప్రారంభిస్తామన్న జేసీ అభిషేక్ గౌడ
- భవన నిర్మాణాల పరిశీలన

డుంబ్రిగుడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డుంబ్రిగుడ ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయంను వేసవి సెలవుల అనంతరం ప్రారంభిస్తామని సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ అన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలను అరకులోయ మండలంలో కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానికంగా జరుగుతున్న విద్యాలయ భవన నిర్మాణ పనులు ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. తరగతి, వసతి, సిబ్బంది నివాస సముదాయలతోపాటు ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరతగతిన పూర్తి చేసి చిన్నారుల ఇబ్బం దులు తొలగించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ తరగతులకు పూర్తి స్థాయి భవనాలు సమకూర్చుతామన్నారు. అనంతరం విద్యాలయానికి సాగు భూములిచ్చిన బాధిత గిరిజనులు చేపడుతున్న ఆందోళన దీక్ష వద్దకు వెళ్లి మాట్లాడారు. భవన నిర్మాణాలు పనులు పూర్తయితే ఉపాధి కల్పిస్తామని వారికి హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు అడ్డుకోవడంతో పిల్లలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంటోందన్నారు. చిన్న పిల్లలతో ఎండలో ఇబ్బంది పడోద్దని బాధితులకు సూచించారు. తహసీల్దార్‌తో నివేదిక రప్పించుకుని న్యాయం చేస్తామని ఆందోళన



అరకులోయ మండలం చిలలబుడులో అంగన్ వాడీ భవనం పనులను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ గౌడ, ఇతర అధికారులు



ఏకలవ్య పాఠశాలకు భూములిచ్చిన బాధితులతో తమాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

విరమించాలని ఆయన సూచించారు. ముందుగా కించుమండలోని మూడు మండలాల ప్రధాన రహదారిలో సంపంగి గెడ్డలో వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రాతి కట్టడాల పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

అరకులోయ: అరకులోయలో జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవీ డాక్టర్ అభిషేక్‌గౌడ గురువారం సందర్శించారు. అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అరకులోయలో ఆర్టీసీకాంప్లెక్స్ నుంచి మెయిన్‌రోడ్డుకు ఉపాధి హామీ నిధులు రూ.65 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను పరిశీలించారు రూ.160 లక్షలతో కొత్తవలస హెచ్ఎన్‌టీసీకి నిర్మిస్తున్న పర్యాటక రహదారి పనులను పరిశీలించారు. చినలబుడు గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనం పనులను పరిశీలించారు. ఈ పనులను నాణ్యతతో చేపట్టేలాప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూ ఈఈ వేణుగోపాల్, డీఈ సుబ్బారావు, ఏఈఈ అభిషేక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలవీ..

పాడేరురూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్‌లలో మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హుకుంపేట, అరకులోయ మం డలాల్లోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హుకుంపేట సబ్‌స్టేషన్‌లో 11 కేవీ, అరకు వేలి సబ్ స్టేషన్‌లోని ఫీడర్లకు కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరాను నిలిపివే స్తున్నట్టు చెప్పారు.వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎలక్ట్రీషియన్, ప్లంబర్స్ సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రామారావు

పాడేరురూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎలక్ట్రీషియన్, ప్లంబర్స్ తాపీమేస్త్రీ ఇతర కార్మికుల సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని శ్రీమోద ఉమా నీలకంఠేశ్వర ఎలక్ట్రీషియన్, ప్లంబర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు తెలిపారు. గురువారం పాడేరులో నిర్వహించిన వివిధ చేతి వృత్తుల కార్మిక సంఘాల డివిజన్ స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్మికులంతా ఏకతాటిపై పనిచేసేలా అన్ని యూనియన్‌ల అధ్యక్షులతో ఐక్యవేదికను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతీ కార్మికుడు ఆయా సంఘాలలో సభ్యత్వం పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తాపీమేస్త్రీ, పేయింటర్స్, కార్పెంటర్స్, ప్లంబర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.రాంబాబు, కె.కేశవరావు, బొంజుబాబు, సింహాద్రి, వెంకటరమణ, కె.రామారావు, ఎస్.దామోదర్, సెంట్రింగ్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సంజీవరావు, సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి: సీఐటీయూ

ముంచంగిపుట్టు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సామాజిక పింఛన్లను మంజూరు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి పి.భీమరాజు అన్నారు. మండలంలోని కరిముఖిపుట్టు సచివాలయంలో గురువారం వయోవృద్ధులు, వితంతులు, వృద్ధులతో కలసి ఈమేరకు కార్యదర్శికి వినతి పత్రాన్ని అందించారు. సచివాలయం పరిధిలో గల జర్రెల పంచాయతీలో 6 మంది వితంతులు, సుమారు 10 మంది వృద్ధులు ఉన్నారని తెలిపారు.

కాఫీ రైతులకు రుణాల పంపిణీకి చర్యలు



మహిళా రైతుకి టార్పాలిన్ అందజేస్తున్న జీసీసీ డీఎం దేవరాజు

చింతపల్లి, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): గిరిజన సహకార సంస్థకు కాఫీ గింజలు విక్రయించిన ఆదివాసీ రైతులకు ఉచితంగా టార్పాలిన్లు పంపిణీ చేస్తున్నట్టు స్థానిక డివిజనల్ మేనేజర్ పి. దేవరాజు అన్నారు. గురువారం మండలంలోని చిన్నయ్యపాలెం, గూణలంక గ్రామాల్లో రైతులకు టార్పాలిన్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసీసీ ఆదివాసీ రైతులు పండించిన కాఫీ గింజలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందన్నారు. మార్కెట్‌లో తీవ్ర పోటీ ఉన్నప్పటికీ జీసీసీ కాఫీ గింజలను కొనుగోలు చేసిందన్నారు. గిరిజన సహకార సంస్థకు చింతపల్లి, జీకేవీధి మండలాల్లో నాన్ ఆర్గానిక్ కాఫీ గింజలను 170మంది విక్రయించారన్నారు. వీరికి టార్పాలిన్లు అందజేస్తున్నట్టు చెప్పారు. కాఫీ రైతులకు పెట్టుబడి రుణాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.

హుకుంపేట; గిరిజనులు అటవీ ఉత్పత్తులు, కాఫీ పంటను జీసీసీకి వి క్రయించాలని పాడేరు జీసీ మేనేజర్ వెంకటేష్ కోరారు. గురువారం మండలంలోని మద్దిపుట్టులోని కాఫీ రైతులు టార్పాలిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామాలకు చెందిన 1400మంది రైతులకు ఉచితంగా టార్పాలిన్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్య క్రమంలో సిబ్బంది ఈశ్వర్, మోహన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ కిట్లు పంపిణీ

చింతపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పేద ముస్లీంలకు జమాత్ ఇస్లామి హింద్ ప్రతినిధులు రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు నిత్యావసర కిట్లు గురువారం పంపిణీ చేశారు. జమాత్ ఇస్లామి ప్రతినిధి మహమ్మద్ ఇబ్రహీం, జిల్లా అధ్యక్షులు షేక్ సయ్యద్ నాజమె, స్థానిక మసీదు అధ్యక్షులు మీరా సాహెబ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పదో తరగతి కీలకం

జి.మాడుగుల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో పదో తరగతి కీలమని వైఎస్ఆర్-టీఎస్ఆర్ చారిటబుల్ చైర్మన్ డా. తేడబాకిరి సురేశ్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించి పదో తరగతి విద్యార్థినులకు ఉచితంగా అట్టలు పంపిణీ చేశారు. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, మాజీ ఎంపీపీ ఎం. వెంకటగంగరాజు, రామరాజు, ఉపాధ్యాయులు సుభద్రమ్మ, తెల్లబాబు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలకు వేతనాలు పెంచే వరకు ఉద్యమం: సీఐటీయూ

అరకులోయ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆశ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అయితే, ప్రభుత్వం పోలీసులతో కార్యకర్తలను నిర్బంధించడం అన్యాయమన్నారు. ఈనేపథ్యంలో సందర్భంగా గురువారం అరకులోయలో నిరసన తెలిపినట్టు ఆయన వివరించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు కొండమ్మ, నాగమణి, సుందరమ్మ,స్వామి, చంప ,ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలోని ఆశ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు.. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆశ కార్యకర్తల న్యాయపరమైన సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. అనం తరం తహసీల్దార్ మాణిక్యంనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలోని టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య, నాగులు, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

ఆశ్రమ పాఠశాలల్లో అడుగంటిన బియ్యం నిల్వలు

- పెదబయలు మండలంలో 11 విద్యాలయాల్లో కొరత
- విద్యార్థులకు భోజనాలు పెట్టేందుకు వార్డెన్ల అవస్థలు

పెదబయలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 ప్రభుత్వ గిరిజన ఆశ్రమ విద్యాలయాల్లో బియ్యం కొరత నెలకొంది. దీంతో వార్డెన్లు, ఇబ్బంది తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రతి నెలా 2వ తేదీ లోపు ఈ ఆశ్రమాలకు జీసీసీ ద్వారా బియ్యం సరఫరా జరిగేది. ఈసారి 6 వ తేదీ దాటుతున్నా బియ్యం పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులకు భోజనాలు వడ్డించేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. జీసీసీ గోదాముల వద్దకు వెళ్లి బియ్యం సరఫరా చేయాలని కోరితే అక్కడి సిబ్బంది పౌర సరఫరాల శాఖ నుంచి ఇంకా రాలేదని, కొందరు గొడౌన్‌లో చిన్నచిన్న సర్దుబాట్లు ఉన్నాయని త్వరలో పంపిణీ చేస్తామని అంటున్నారని వార్డెన్లు వాపోతున్నారు. వాస్తవానికి నెల చివరలోనే పౌరసరఫరాల శాఖనుంచి బియ్యం జీసీసీ గోదాములకు రావాలి. ఈ సారి వచ్చిన బియ్యం నిల్వలను ఆశ్రమాలకు సరఫరా చేయకుండా మండలంలోని అన్ని డీఆర్ డిపోలకు పంపిణీ చేయడం



డుంబ్రిగుడలోని ఓ పాఠశాలలో నిండుకున్న నిల్వలు

పై వార్డెన్లు మండిపడుతున్నారు. వార్డెన్లు తమ ఆశ్రమాల్లో ఉన్న బియ్యాన్ని ఒకరికొకరు సర్దుబాటు చేసుకుంటూ విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారు. మండల కేంద్రంలో ఓ ఆశ్రమ పాఠశాలలో గురువారం ఒక్క కూడా బస్తాలేదు. దీంతో కేజీబీవీ పాఠశాలలోని బియ్యంను అడిగి తెచ్చుకున్నారు. ఓ పాఠశాలలో ఏకంగా పెదబయలు డీఆర్ డిపో నుంచి మూడు బస్తాలు ఇలా అరువు అడిగితెచ్చుకున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. శు క్రవారం కూడా జీసీసీ నుంచి బియ్యం పంపిణీ చేయకపోతే విద్యార్థులను పస్తులు ఉంచాల్సి వస్తోందని వాపోతున్నారు.

జీసీసీ నుంచి బియ్యం సరఫరా కాలేదు: సహాయ గిరిజన సంక్షేమ అధికారిణి స్వర్ణలత

ఈ విషయంపై మండల సహాయ గిరిజన సంక్షేమ అధికారిణి కె.స్వర్ణలతకు 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఫిబ్రవరి నెల 25 తేదీన 25 వార్డెన్ల నుంచి క్లోజింగ్ బ్యాలన్స్‌లు డీడీ కార్యాలయానికి పంపించామన్నారు. 27 తేదీన ఎలాట్‌మెంట్ వచ్చిందన్నారు. కానీ, ఈ నెల ఆరో తేదీ వచ్చినా జీసీసీ నుంచి బియ్యం పంపిణీ కాలేదని వివరించారు. జీసీసీ యాజమాన్యాన్ని అడిగితే పౌరసరఫరాల శాఖ నుంచి గోదాములకు బియ్యం సరఫరా కాలేదని చెబుతున్నారని చెప్పారు. స్థానిక జీసీసీ గోదాం ఇన్‌చార్జి దీనకుమారి వద్ద ప్రస్తావించగా, ఆశ్రమాలకు పంపిణీ చేయాల్సిన బియ్యం పౌరసరఫరాల శాఖ ఇంకా రాలేదని చెప్పారు. వారు విడుదల చేసిన వెంటనే బియ్యం అందిస్తామన్నారు.

పీఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణం వేగవంతం

- హౌసింగ్ పీడీ బాబునాయక్



పల్లంవలసలోని పీవీటీజీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ బాబునాయక్

అనంతగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ కింద మం జూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ బాబునాయక్ కోరారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ పల్లంవలసలోని పీవీటీజీ గిరిజనులు నిర్మిస్తున్న ఇళ్లను గురువారం పరిశీలించారు. పంచాయతీ పరిధిలోని 98 ఇళ్లు మంజూరైనట్టు ఆయన తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.. గతంలోని ఇళ్లకు 2.39 నుంచి మంజూరై ఉండగా.. ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం ఒక్కో ఇంటికి రూ. 3.39 లక్షలతో కేటాయిస్తున్నట్టు చెప్పారు. బిల్లులు వెంటనే చెల్లిస్తామని, త్వరితగతిన ఇళ్లు పూర్తిచేయాలని గిరిజనులను కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల ఆత్మగౌరవ దీక్షలు ప్రారంభం



దీక్ష శిబిరంలో అఖిలపక్ష ప్రజా సంఘ నాయకులు

పాడేరురూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలపై ము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా ఆదివాసీ ఆత్మగౌరవ దీక్షలను కూడా రాధాకృష్ణ ఆధ్యక్షతన సీదరి మంగ్లన్నదొర, ఎస్.ధర్మన్నపడాల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఆదివాసీలకు శతశాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేపెట్టాలని, మెగా డీఎస్సీతో పాటు ఆదివాసీ ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ దీక్షలు గురు, శుక్రవారాలు చేపడుతున్నామన్నారు. తొలిరోజు ఎస్.చిట్టిబాబు, కె.సుబ్రమణ్యం, సలీం, యువరాజు, కాంతారావు, విమల, హైమావతి, రవణమ్మ, రాణి, కీర్తన, దుర్గ, శ్రీదేవి, రాజుబాబు, కొండలరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాడేరులో కేంద్ర కాఫీ బోర్డు చైర్మన్ దినేశ్ పర్యటన

చింతపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులో కేంద్ర కాఫీ బోర్డు చైర్మన్ ఎంజే దినేశ్ పర్యటించనున్నట్టు బోర్డు సభ్యుడు జైతి ప్రభాకర్ తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఆదివాసీ రైతులకు కాఫీ బోర్డు ద్వారా రాయితీలు, యంత్రాలు ఏ స్థాయిలో అందుతున్నాయని స్వయంగా పరిశీలించనున్నారన్నారు. కాఫీ రైతులు ఏవిధంగా దిగుబడులు సాధిస్తున్నారు, ఆర్థిక స్థితిగతులను ఆయన తెలుసుకుంటారన్నారు. కలెక్టర్, కేంద్ర కాఫీ బోర్డు అధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. కాఫీ బోర్డు అధికారులు, అభ్యుదయ రైతులు, బీజేపీ నాయకులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్



జి. మాడుగులలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

జి.మాడుగుల : అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మహిళల రక్షణ చట్టాలు, హక్కులపై వివరించారు. ఎ స్ఐ షణ్ముఖరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: పోలీసులు సేవలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్సై అప్పలసూరి అన్నారు. గురువారం పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు హాజరయ్యారు. పోలీసుల విధులు, ఖైదీలను బంధించే గది, ఆయుధాలుపై అవగాహన కల్పించారు.

ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీసుల లక్ష్యం

డుంబ్రిగుడ: ప్రజలకు రక్షణతోపాటు వా రికి అండగా ఉండడమే తమ లక్ష్యమని స్థానిక ఎస్ఐ పాపినాయుడు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో కస్తూర్బా విద్యాలయం బాలికలతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

సీలేరు, మార్చి 6, (ఆంధ్రజ్యోతి):సీలేరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం సీఆర్‌పీఎఫ్ 42 బెటాలియన్ కమాండెంట్ ఎస్‌హెచ్ ధర్మప్రకాశ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సివిక్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా నెల రోజులుగా 11 మంది గిరిజన మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ జేఎస్ షెకావత్, స్థానిక ఎస్ఐ రవీంద్ర, ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గెత్సేమనే ప్రార్థనా మందిరం వార్షికోత్సవం

సీలేరు, మార్చి 6, (ఆంధ్రజ్యోతి): సీలేరులోని గెత్సేమనే ప్రార్థనా మందిరం 13వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రార్థనా మందిరం నిర్వాహకుడు జాన్ మోజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏపీ జెన్‌కో ఈఈ రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం సీలేరులోని కాన్వెంట్ విద్యార్థులు 50 మందికి పరీక్షలు రాసే అట్టలను, పెన్నులను అందజేశారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నంనకు చెం దిన పాస్టర్ అజిరియ, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, టీడీపీ నాయకుడు బొర్రా కృష్ణ, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, ఎం సత్తిబాబు, వానపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నుర్మతి పాఠశాలలో వైద్య శిబిరం

జి.మాడుగుల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుర్మతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ధనుష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల హెచ్ఎం శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

చింతపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సిబ్బంది గృహాల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని తమ్మంగుల పంచాయతీ కార్యాలయం, సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడారు.

సీలేరు: సీలేరులో గురువారం ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దుర్గో, ఎంపీటీసీ సభ్యుడు పి. సాంబమూర్తి, కార్య దర్శి పరశురామ్,ఉప సర్పంచి కె. వల్లీప్రసాద్, కూటమి నాయకుడు చిటికెల రాము, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

హుకుంపేట మార్చి 6 ఆంధ్రజ్యోతి; మండలంలోని ఉప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి రణ ప్రతాప్ ఆధ్వర్యంలో, పాతకోట పంచాయతీ పెద్దచట్టు, భీమవరం పంచాయతీ గుమ్మడి గండువ గ్రామంలో గురువారం ఆరోగ్య విస్తరణ అధికారి కోడ మహేశ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలందించారు. వడదెబ్బ బారిన పడకుండా జా గ్రత్త వహించాలని గ్రామస్థులను కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మురళీ, సిబ్బంది భాస్కర్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల నడకయాతన


డొంకాడ అగ్రహారం నుంచి యరకంపేట పాఠశాలకు కాలినడకన వస్తున్న గిరిజన విద్యార్థులు

గిరిజన విద్యార్థులు చదుకోవాలంటే పడరాని కష్టాలు పడతున్నారు. ఊరుకు మూడు కిలోమీటర్ల దూరంలో పాఠశాల ఉండడంతో నడకయాతన అనుభవిస్తున్నారు. రానుపోను ఆరు కిలోమీటర్ల వరకు పసి కాళ్లకు పని చెబుతున్నారు. ఈ క్రమంలో ఇంటి నుంచి పాఠశాలకు, అక్కడి నుంచి మరలా ఇంటికి చేరుకునే వరకూ తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

- ఊరుకు మూడు కిలోమీటర్ల దూరంలో పాఠశాల
- రానుపోను ఆరు కిలోమీటర్లు నడవాల్సిందే!
- బడికి వెళ్లాలంటే చిన్నారులకు తప్పని ప్రయాస
- డొంకాడ అగ్రహారం గిరిజన విద్యార్థుల కష్టాలు

నాతవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములగపూడి పంచాయతీ శివారు డొంకాడ అగ్రహారం గ్రామంలో 2016 వరకు ప్రాథమిక పాఠశాల ఉండేది. దాదాపు 22 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకునేవారు. అయితే 2016 తర్వాత ఇక్కడ తగినంత మంది విద్యార్థులు లేరన్న సాకుతో విద్యా శాఖ అధికారులు పాఠశాలను మూసేశారు. ఈ పాఠశాలను డి.యర్రవరం పంచాయతీ శివారు యరకంపేట పాఠశాలలో విలీనం చేశారు. డొంకాడ అగ్రహారానికి మూడు కిలోమీటర్ల దూరంలో పాఠశాల ఉండడంతో రానుపోను ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లి రావాల్సి వస్తోంది. దీంతో ప్రస్తుతం ఎనిమిది మంది గిరిజన విద్యార్థులు కాలినడకన యరకంపేట పాఠశాలకు వస్తున్నారు. ఈ క్రమంలో చిన్నారులు ఇంటి నుంచి పాఠశాలకు, మరలా ఇంటికి చేరుకునే వరకు తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.


యరకంపేట పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఎండా కాలంలో కష్టమే!

ప్రస్తుతానికి ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులకు, మార్చి నెలలో ఎండలకు మరిన్ని కష్టాలు తప్పవు. ఎండలో రోజూ ఇరువైపులా ఆరు కిలోమీటర్లు నడవడం అత్యంత కష్టంతో కూడుకున్న పని అని, దీని గురించి తలచుకుంటేనే తమకు బాధగా ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కాగా యరకంపేటలో నలుగురు విద్యార్థులే ఉన్నారని, ఎనిమిది మంది ఉన్న తమ గ్రామంలోని పాఠశాలను అక్కడ కలపడం సరికాదని తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే యరకంపేట పాఠశాలకు ప్రహరీ గోడ లేదని, ఇక్కడ పాఠశాలలో తాగు నీటికి కూడా ఇబ్బందులు తప్పడం లేదని వారు వాపోతున్నారు. ఈ విషయంలో విద్యా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పునరాలోచన చేయాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.


పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ అధికారి రాజేశ్వరి

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.రాజేశ్వరి

నర్సీపట్నం అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.రాజేశ్వరి సూచించారు. పెదబొడ్డెపల్లి, నర్సీపట్నంలోని బీసీ వసతి గృహాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి చర్చించారు. జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అందరూ మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఇందుకోసం వసతిగృహాల సంక్షేమాధికారులు కృషి చేయాలని సూచించారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ బీసీ, ఎస్సీ వసతి గృహాల భవనాలు, ఇతరత్రా అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఈ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూవో వి.గోపీనాథరావు, హెచ్‌డబ్ల్యూవో కె.అర్జున్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించిన కేంద్ర బృందం


పాకలపాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

గొలుగొండ మార్చి, (ఆంధ్రజ్యోతి) 6: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను కేంద్ర బృందం ప్రతినిధులు గురువారం పరిశీలించారు. మండలంలోని పాకలపాడు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్, పింఛన్లు, జల్‌జీవన్ తాగునీటి పథకాలపై బృందం ప్రతినిధులు లబ్ధిదారులతో మాట్లాడి విరాలను తెలుసుకున్నారు. లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. పక్కాగా అమలవుతున్నాయని కేంద్ర బృందానికి లబ్ధిదారులు వివరించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వి.సంధ్యారాణి, బి.బానుచంద్ర, జి.లోకేశ్, బి.లక్ష్మీకుమారి, గొలుగొండ ఎంపీడీవో మేరీరోజీ, పంచాయతీ కార్యదర్శి రాజేశ్ పాల్గొన్నారు.

డొంకాడకు రహదారి సౌకర్యం కల్పించాలి

అనకాపల్లి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కె.యల్లవరం పంచాయతీ డొంకాడ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఒక లేఖలో కోరినట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. కరక ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి డొంకాడ గ్రామానికి కిలోమీటరు దూరం మాత్రమే ఉందని, గత ప్రభుత్వం రూ.1.35 కోట్లు మంజూరు చేసిందని, అటవీ అనుమతులు లేవని పనులు ప్రారంభించలేదని చెప్పారు. దీంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని, పిల్లలు చదువుకు దూరమవుతున్నారని వాపోయారు. కలెక్టర్ స్పందించాలని కోరినట్టు చెప్పారు.

నర్సీపట్నంలో టెక్‌మెట్ ఇనిస్టిట్యూషన్ ప్రారంభం

మాకవరపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం పెదబొడ్డేపల్లిలో టెక్‌మెట్ ఇనిస్టిట్యూషన్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నంలో టెక్‌మెట్ సంస్థ ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నారు. దీనివల్ల స్థానిక యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఈ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లతో పాటు ప్రముఖ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కూడా కల్పించనున్నటనాయన తెలిపారు. ఇప్పటి వరకూ ఇలాంటి శిక్షణ కేంద్రం లేకపోవడంతో యువత ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు నర్సీపట్నంలోనే ఈ సదుపాయం అందుబాటులో రావడం మంచి పరిణామం ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ మల్ల నాగేశ్వరరావు, బొడ్డెపల్లి కౌన్సిలర్ రాజునాయుడు, మాజీ కౌన్సిలర్ రెడ్డప్పలనాయుడు, టీడీపీ నాయకులు దాసు, దశరథ పాల్గొన్నారు


సంస్థ బ్రాంచిని ప్రారంభిస్తున్న విజయ్

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

- నర్సీపట్నం డీఎఫ్‌వో శ్యామ్యూల్

గొలుగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని నర్సీపట్నం డీఎఫ్‌వో శ్యామ్యూల్ తెలిపారు. గొలుగొండ మండల కేద్రంలోని టేకు కలప డిపోలో గురువారం టేకు కలప వేలం పాట వేశారు. ఈ వేలంలో డీఎఫ్‌వో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా కిందపడిన ఆకులు, చెత్తను నిప్పు అంటిస్తున్నామన్నారు. ముందస్తుగానే ఈ కార్యక్రమం చేపట్టడంతో అగ్నిప్రమాదాలు నివారించవచ్చునని తెలిపారు. అలాగే కరక, పప్పుశెట్టిపాలెం, సాలికమల్లవరం అటవీ భూముల్లోని రంగురాళ్ల క్వారీల వద్ద అక్రమ తవ్వకాల నియంత్రణకు నిరంతరం పెట్రోలింగ్‌తో పాటు సిబ్బందిని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్, గొలుగొండ సెక్షన్ అధికారి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.


టేకు కలప డిపోలో కలప వేలం పాట వేస్తున్న డీఎఫ్‌వో శ్యామ్యూల్

మాతునాయుడు కుటుంబాన్ని ఆదుకుంటాం

మాకవరపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన మాతునాయుడు కుటుంబాన్ని ఆదుకుంటామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ భరోసా ఇచ్చారు. మాతునాయుడు కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని కుటుంబీకులు కోరగా, ఎస్‌ఐ ఉమామహేశ్వరరావుతో ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నేత బాపిరాజు ఉన్నారు.

'పవన్ కల్యాణ్‌పై జగన్ విమర్శలు సరికాదు'

గొలుగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై మాజీ సీఎం జగన్ స్థాయి మరచి విమర్శలు చేయడం సరికాదని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. గొలుగొండలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ఏ స్థాయిలో ప్రజలు గౌరవించారో జగన్ తెలుకోవాలని హితవు పలికారు. భవిష్యత్తులో వైసీపీ భూస్థాపితమవుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు గండెం దొరబాబు, నాయకులు దుక్కల రమేశ్ సలాదుల ప్రసాద్‌బాబు, తదితరులు ఉన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మాకవరపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బూరుగుపాలెం గ్రామంలో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి చిరంజీవి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానవాటిక అభివృద్ధికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ.10 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ పనులు త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాకవరపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఏఈ బాలకృష్ణ తెలిపారు. కన్నూరిపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ రామన్నపాలెం, 11కేవీ భీమబోయినపాలెం ఫీడర్ల మరమ్మతు పనుల్లో భాగంగా శెట్టిపాలెం, జెడ్.గంగవరం, దుంగలవానిపాలెం, రాజుపేట, భీమబోయినపాలెం, రామన్నపాలెం, ఎరకన్నపాలెం, ధర్మవరం, వెంకటాపురం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

ఇన్‌స్పైర్ మనక్‌కు కాశీపురం విద్యార్థులు

దేవరాపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు నిర్వహించే ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు కాశీపురం విద్యార్థులు ప్రతిభ సాధించారు. ఉన్నత పాఠశాలకు చెందిన నక్కా హరిప్రియ, ఆన్‌మెన్డ్ పెట్రోల్ బంక్ ప్రాజెక్టు, పోలిపల్లి ప్రదీప్ తయారు చేసిన జెన్డర్ బేస్ వైర్లస్ రోబోట్ గేమింగ్ ప్రాజెక్టు జిల్లా స్థాయిలో ఎంపికైనట్టు హెచ్‌ఎం పీబీటీ.సుందరి తెలిపారు. విద్యార్థినులు ప్రోత్సహించిన రామలక్ష్మి, సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, కొటాన రాంబాబు తదితరులు అభినందించారు.


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తారువ, బి.కింతాడ ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తెనుగుపూడి, వెంకటరాజపురం, గర్నింగి, అలమండ, కొత్తపెంట, ములకలాపల్లి, కొత్తపల్లి, ముషిడిపల్లి గ్రామాలకు సరఫరా ఉండ దన్నారు.

ఇంటర్ పరీక్షలకు 15 మంది గైర్హాజరు

దేవరాపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గణితం, బోటనీ, సివిక్స్, ఒకేషనల్ పరీక్షలు గురువారం జరిగాయి. 257 మందికి 242 మంది హాజరయ్యారని పరీక్షల నిర్వాహకురాలు ఎస్. నిర్మల తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ గ్రామంగా లోవ కొత్తపల్లి ఎంపిక


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నూరు శాతం ప్రకృతి వ్యవసాయ గ్రామంగా మండలంలోని లోవ కొత్తపల్లి ఎంపికయ్యిందని మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు తెలిపారు. గురువారం ఆ గ్రామ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్‌లో లోవకొత్తపల్లి గ్రామంలోని రైతులంతా అన్ని రకాల పంటలను సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో పండించాలన్నారు.

ఉపాధి కూలీలతో గ్రామస్థుడు వాగ్వాదం

- తన భూమిలో పనులు ఎలా చేస్తున్నారని అభ్యంతరం
- తహసీల్దార్ కార్యాలయం వద్ద కూలీల ధర్నా

బుచ్చెయ్యపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్.సింగవరంలో గురువారం ఉపాధి కూలీలకు, అదే గ్రామానికి చెందిన వ్యక్తి మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. గ్రామంలో చాకిరేవుగెడ్డ దగ్గర చెరువులో ఉపాధి కూలీలు పనిచేస్తుండగా.. అదే గ్రామానికి చెందిన గుడాల నూకరాజు అనే వ్యక్తి తన భూమిలో ఉపాధి పనులు ఎలా చేస్తున్నారంటూ కూలీలతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఉపాధి కూలీలకు ఆక్రమణదారునికి కొద్దిసేపు ఘర్షణ జరిగింది. దీంతో ఆ గ్రామ టీడీపీ నాయకుడు వేపాడ మధుతో కలిసి 100 మంది ఉపాధి కూలీలు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. చెరువును ఆక్రమించి గ్రామస్థులపై బెదిరింపులకు పాల్పడుతున్న గుడాల నూకరాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ ఎం.లక్ష్మికి, ఎస్‌ఐ శ్రీనివాసరావుకి వినతిపత్రాలు ఇచ్చారు. మండల స్థాయి అధికారులు న్యాయం చేయకుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆ గ్రామ రైతులు వేపాడ రాజారావు, మధు, బుజ్జినాయుడు, రేనం బాలకృష్ణ, శ్రీను, సోము నాయుడు, తదితరులు తెలిపారు. ఈవిషయంపై తహసీల్దార్ ఎం.లక్ష్మి వద్ద ప్రస్తావించగా.. చెరువును ఆక్రమించి ఉపాధి పనులు అడ్డగించిన వ్యక్తిపై ఫిర్యాదు అందిందన్నారు. సర్వే చేయించి ఆక్రమణలు గుర్తిస్తామని, ఆపై భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. పట్టాలు లేకుంటే భూమిని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

ఆక్రమణదారుల నుంచి దుర్గాలమ్మ ఆలయ భూమి స్వాధీనం

రావికమతం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపూడి దుర్గాలమ్మ అమ్మవారి భూమికి ఆక్రమణదారుల చెర నుంచి విముక్తి లభించింది. గ్రామస్థులు, ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు గురువారం సర్వే నిర్వహించి భూమిని ఆలయ కమిటీకి అప్పగించామని తహసీల్దార్ బి.వెంకటరమణ తెలిపారు. తహసీల్దార్ అందించిన వివరాలిలా ఉన్నాయి.

దొండపూడి దుర్గాలమ్మ అమ్మవారి ఆలయానికి ఏడు తరాల క్రితం దొండపూడి రెవెన్యూలో సర్వే 269/21లో 43 సెంట్లు భూమిని దాతలు విరాళంగా ఇచ్చారు. ఈభూమి అప్పటి నుంచి దుర్గాలమ్మ ఆలయానికి సర్వహక్కులు ఉండేవి. ఈ భూమిలో 20 సెంట్లు భూమిని అదే గ్రామానికి చెందిన పెచ్చేటి చంద్రమణి ఆక్రమించారు. దీనిపై ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు కోరినా అమ్మవారి భూమిని ఆమె విడిచిపెట్టలేదు. దీంతో ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఫిర్యాదు మేరకు గురువారం సర్వేయర్‌తో సర్వే చేయించామని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. దుర్గాలమ్మ ఆలయానికి చెందిన 43 సెంట్లల్లో పెచ్చేటి చంద్రమణి 23 సెంట్లు ఆక్రమించినట్టు గుర్తించామన్నారు. ఆక్రమిత భూమికి గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధుల సమక్షంలో సరిహద్దులు నిర్ధారణ చేసి కమిటీకి అప్పగించామన్నారు. ఇకపై ఆ భూమిని ఎవరు అన్యాక్రాంతం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకటరమణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దొండపూడి ఉప సర్పంచ్ జి.రాజారావు, మాజీ సర్పంచ్ జి.తాతబాబు, టీడీపీ నాయకులు వెదురుపర్తి వెంకటాచారి, ఆలయ ధర్మకర్త జి.శ్రీను, గ్రామ పెద్దలు జి.సన్యాసినాయుడు, జి.వెంకటసత్యం, ఆర్‌ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.


దొండపూడి దుర్గాలమ్మ ఆలయ కమిటీ సభ్యులకు ఆక్రమణ భూమిని అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

నీటికుంటల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలి : ఉపాధి పీడీ

చీడికాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):భూగర్భ జలాలు పెంపొందించేందుకు నీటి నిల్వ కుంటలు నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.పూర్ణిమా దేవి వేతనదారులను కోరారు. మండలంలో కోనాం పంచాయతీ గుంటి గ్రామంలో జరుగుతున్న పనులను గురు వారం ఆమె పరిశీలించి వేతనదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 11గంటల వరకూ పనిచేసేలా ఉండాలన్నారు. రోజువారీ రూ.300 వచ్చేలా పనిచేయాలన్నారు. అలాగే అటవీ, వ్యవసాయ పట్టాలు పొందిన వారికి 150 రోజులు పనిదినాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ బండారు శ్రీనివాసరావు, ఏపీవో అల్లు గంగునాయుడు,టెక్నికల్ అసిస్టెంట్‌లు బిఎస్.పాత్రుడు, అప్పలనాయుడు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వమ్మవరంలో రేషన్ బియ్యం పట్టివేత

రావికమతం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరంలో రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి ఆర్‌ఐ పట్టుకున్నారు. మర్రివలసకు చెందిన వ్యక్తి ఇంటింటా రేషన్ బియ్యం కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుంటారు. వమ్మవరంలో ఒక పెంకుటింటి వరండాలో బియ్యం మూటలను నిల్వ చేసి టార్పా కప్పారు. గురువారం రాత్రి ఆ బియ్యాన్ని అక్కడి నుంచి తరలించేందుకు సిద్ధం చేస్తుండగా స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆర్‌ఐ సతీష్ బియ్యం మూటలను పరిశీలించారు. రేషన్ బియ్యాన్ని నాలుగు మూటల్లో వంద కేజీలే ఉన్నాయని, మిగిలినవి రైతులకు చెందిన మినుముల మూటలని ఆర్‌ఐ తెలిపారు. నాలుగు మూటల బియ్యాన్ని స్వాధీనం చేసుకోని ఎండీయూ నిర్వాహకుడికి అప్పగించామని తెలిపారు. బియ్యం అక్రమ తరలింపుపై 6ఏ కేసు సీఎస్ డీటీ నమోదు చేయాల్సి ఉందన్నారు.

కేపీ అగ్రహారం రోడ్డు గుంతలు పూడ్చివేత

బుచ్చెయ్యపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీ.అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు సొంత నిధులు వెచ్చించి రోడ్డుకు ఇరువైపులా తుప్పలు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అనంతరం గుంతలను క్రషర్ బూడిదతో పూడ్పించారు. కేపీ.అగ్రహారం నుంచి బుచ్చెయ్యపేట వరకూ గోతులమయంగా ఉన్న రోడ్డును బాగుచేయించారు. దీంతో గ్రామస్థులు సర్పంచ్‌ని అభినందించారు.

'రైవాడ జలాశయ అభివృద్ధికి కృషిచేద్దాం'

దేవరాపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి) రైవాడ జలాశయం అభివృద్ధికి ఐక్యంగా పనిచేద్దామని జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు అన్నారు. గురువారం అతిథిగృహంలో నీటి సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి వనరులు కాపాడుకొని రైతుకు సక్రమంగా నీరందించే విధంగా కలిసి పనిచేద్దామన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సహకారంతో జలాశయ అభివృద్ధికి కాలువలు, చెరువులు అభివృద్ధి పరిచేలా కృషి చేద్దామన్నారు. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు పైసా కూడా ఖర్చు చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, డీఈఈ సత్యంనాయుడు, రెడ్డి.శ్రీనివాస్, కొమార బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

చీడికాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో అప్పలరాజుపురం దేవిమెట్టపై అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లాపరిషత్ స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనూరాధ, చీడికాడ, మాడుగుల ఎంపీపీలు కురచా జయమ్మ, తాళ్లపురెడ్డి వెంకటరాజారాం, సర్పంచ్ చుక్క అప్పలనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, గొల్లవిల్లి రాజబాబు, కురచా నారాయణమూర్తి, టీడీపీ జిల్లా కార్యదర్శి గవిరెడ్డి జగన్నాథం, గవిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ నిర్మాణానికి విరాళం

దేవరాపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం అభివృద్ధికి గుండు ఈశ్వరరావు, రాంబాబు సోదరులు రూ.20వేలు మాజీఎంపీపీ కిలపర్తి భాస్కరరావు చేతుల మీదుగా ఆర్యవైశ్య సంఘ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాడ వెంకటరమణ, వెత్సా రమేశ్, పైడిశెట్టి విశ్వేష, గుప్తా పాల్గొన్నారు.

ఇంకా జగన్ ప్రచారంలోనే పౌరసరఫరాల శాఖ

- రేషన్ వాహనంపై దర్శనమిస్తున్న జగన్ బొమ్మ


గవరవరం రేషన్ వాహనంపై తొలగించని జగన్ బొమ్మ

చోడవరం, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇంకా చాలాచోట్ల వైసీపీ అధినేత జగన్ బొమ్మలపై కొందరు మమకారం వదులుకోలేనట్టు కనపడుతున్నారు. అధికారులు సైతం ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకున్నట్టు కనిపించడం లేదు. వైసీపీ హయాంలో జగన్ బొమ్మలతో కూడిన సంచార రేషన్ బళ్లపై జగన్ చిత్రాలు దాదాపుగా తొలగించారు. అయితే మండలంలోని గవరవరంలో మాత్రం ఇప్పటికీ జగన్ బొమ్మతో కూడిన వాహనంతోనే రేషన్ పంపిణీ కొనసాగుతుండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. రెండు రోజుల క్రితమే ఎన్నికల కోడ్ తొలగిపోయింది. అంటే ఎన్నికల కోడ్‌లో సైతం ఈ రేషన్ వాహనం జగన్ బొమ్మతోనే తిరిగినప్పటికీ, పౌరసరఫరాల శాఖ అధికారులు ఏమాత్రం గుర్తించలేదు. ఇప్పటికీ రేషన్ బళ్లపై జగన్ బొమ్మలు కనిపిస్తుండడం పౌరసరఫరాల శాఖ అధికారుల ఉదాసీనతకు ఇదో నిదర్శనంగా ఉందని విమర్శలు రేగుతున్నాయి.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పౌష్టికాహారం పంపిణీ

రావికమతం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలికి చెందిన సమిధ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చీమలపాడు పంచాయతీలోని పలు పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ మేరకు చీమలపాడు, ములకలాపల్లి, కల్యాణపులోవ, జడ్.జోగుంపేట, తాటిపర్తి, కుంజుర్తి, డోకులమ్మపాడు, ధర్మవరం పాఠశాలలకు చెందిన 460 విద్యార్థులకు నోట్ పుస్తకాలు,పెన్నులు, వేరుశనగ చక్కీలు, బిస్కెట్లు, సంతూరు సబ్బులను పంపిణీచేశారు. కార్యక్రమంలో సమిధ సంస్థ కార్యదర్శి డి.వీరభద్రరావు, గిరిజన సంఘం నాయకులు నల్లి కల్యాణం, కిడారి లక్ష్మి పాల్గొన్నారు.

80 శాతం రాయితీతో పశువులకు బీమా

రోలుగుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రీమియంలో 80 శాతం రాయితీతో ప్రభుత్వం పశు బీమా అమలు చేస్తుందని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని రోలుగుంట పశువైద్యాధికారి నూకేశ్వరరావు కోరారు. గురువారం రోలుగుంటలో బీమా చేయించుకున్న రైతుల పశువులకు ట్యాగ్‌లను వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు, దుక్కిటెడ్లు, గొర్రెలు, మేకలకు మూడేళ్లపాటు చేసే బీమా పథకాన్ని ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు. కేవలం రూ.400లతో తమ పశువులకు రూ.30వేలకు బీమా చేయించుకోవచ్చునని మూడేళ్ల వరకు వర్తిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు పశువైద్య కేంద్రాన్నిగాని, స్థానిక రైతు సేవా కేంద్రాలను సంప్రదించి చేయించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ అగ్రికల్చరల్ బీమా కంపెనీ జిల్లా సమన్వయకర్త వెంకట్ గణేష్, గోపాలమిత్ర రాజు, పశుసంవర్ధక శాఖ సహాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ తీర్థం

బుచ్చెయ్యపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది జంక్షన్‌లో మోదకొండమ్మ తీర్థం ఘనంగా నిర్వహించారు. మంగళవారం నుంచి గురువారం వరకూ మూడు రోజులుపాటు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దొండా గిరిబాబు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దాతలు అందజేసిన పంచలోహ విగ్రహాన్ని ఆలయ కమిటీ చైర్మన్ దొండా గిరిబాబు ఆధ్వర్యంలో భక్తులు వడ్డాది పురవీధుల్లో ఊరేగించిన అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రాలను అందిస్తున్న పార్టీ నాయకులు

సీఎంకు వినతుల వెల్లువ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం రాత్రి పార్టీ కార్యాలయంలో బస చేశారు. గురువారం ఉదయం పెద్దసంఖ్యలో నేతలు, ప్రజలు అక్కడికి చేరుకుని, సమస్యలపై వినతిపత్రాలను ఇచ్చారు. అన్నింటినీ సావధానంగా ఆలకించిన ముఖ్యమంత్రి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

గీతంలో మహామహుల సందడి


ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, హాజరైన ఆహ్వానితులు

- ఉత్సాహంగా ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ
- చలోక్తులతో నవ్వులు పూయించిన మాజీ ఉప రాష్ట్రపతి
- ఆద్యంతం ఆసక్తిగా సాగిన సమావేశం

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం మహామహులు సందడి చేశారు. డా.దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్, మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఇప్పటివరకు మనం చదువుకున్న చరిత్రలో అసలు వాస్తవాలు లేవని, నిజమైన చరిత్రను ప్రజలకు అందించే దిశగా దగ్గుబాటి ప్రయత్నించారని నేతలు కొనియాడారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందిస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు, చిత్రంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపీలు పురందేశ్వరి, శ్రీభరత్


మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఫొటో అందజేస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి


కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు జీసీసీ కిట్ అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్

ఢిల్లీలో ఏటికొప్పాక లక్కబొమ్మల స్టాల్

ఎలమంచిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే 'వివిధతా కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమంలో ప్రసిద్ధి చెందిన ఏటికొప్పాక లక్కబొమ్మల స్టాల్‌ను ఏర్పాటు చేసినట్టు స్థానిక కళాకారుడు పెదపాటి సత్యనారాయణ(శరత్) తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల కళాకారులు రూపొందించిన బొమ్మలు, కలంకారీ వస్త్రాలు, హస్తకళల ప్రదర్శనను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం ప్రారంభించారని ఆయన తెలిపారు. ఏటికొప్పాక లక్కబొమ్మల స్టాల్‌ను పలువురు ప్రముఖులు సందర్శించి మెచ్చుకున్నారని చెప్పారు.

ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఏటికొప్పాక లక్కబొమ్మల స్టాల్


కల్లుగీత కులాల వారికి 15 మద్యం దుకాణాలు

- లాటరీ పద్ధతిలో కేటాయించిన అధికారులు

కొత్తూరు (అనకాపల్లి), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్లుగీత కులాల వారికి లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ గురువారం చేపట్టారు. డీఆర్వో వై.సత్యనారాయణ, జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ అధికారి వి.సుధీర్ ఆధ్వర్యంలో దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ తీశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, జిల్లాలో కల్లుగీత కులాల వారికి ప్రభుత్వం కేటాయించిన 15 మద్యం దుకాణాలకు 205 దరఖాస్తులు వచ్చాయని, లాటరీ తీసి ఏ మద్యం షాపు, ఎవరికి వచ్చిందో వెల్లడించామన్నారు. మద్యం దుకాణం పొందిన వారు సాయంత్రంలోగా రెండు నెలల లైసెన్సు ఫీజు చెల్లించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ సహాయ అధికారి రాజశేఖర్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు. జిల్లాలో కల్లుగీత కులాల వారికి మండలాల వారీగా కేటాయించిన మద్యం షాపుల వివరాలు.. అనకాపల్లి రూరల్, మునగపాక, రోలుగుంట, కోటవురట్ల, మాకవరపాలెం, నాతవరం, ఎలమంచిలి రూరల్, రాంబిల్లి, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, పాయకరావుపేట, నక్కపల్లి, వి.మాడుగుల, చీడికాడ, రావికమతం.


మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ తీస్తున్న డీఆర్‌వో సత్యనారాయణ

చింతపండుకు గిరాకీ

చీడికాడ, మార్చి6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాంలో గురువారం జరిగిన సంతకు గిరిజనులు తీసుకువచ్చిన చింతపండుకి మంచి ధర పలికింది. గత మూడు వారాలతో పోలిస్తే అధిక ధర లభించిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చీడికాడ మండలంలో పలు గిరిజన గ్రామాలతోపాటు పాడేరు, అనంతగిరి, హుకుంపేట మండలాలకు చెందిన గిరిజనులు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను గురువారం కోనాంలో జరిగే సంతకు తీసుకువచ్చి అమ్ముకుంటుంటారు. ప్రస్తుతం చింతపండు సీజన్ కావడంతో ఎక్కువ మంది కావళ్లు, బుట్టలతో చింతపండు తెచ్చారు. సంతకు వచ్చిన వ్యాపారులు చింతపండు కొనుగోలుకు పోటీపడ్డారు. సుమారు 20 కిలోల బరువు వుండే కావడి చింతపండు రూ.1,400 నుంచి రూ.1,500 పలికింది. గత వారం కావడి చింతపండు రూ.1,000 నుంచి రూ.1,100లకు మాత్రమే అమ్ముడుపోయింది. కిలోకు రూ.20 వరకు అదనంగా ధర లభించడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. పది గంటలకల్లా చింతపండు అమ్ముడుపోయింది. వచ్చిన డబ్బులతో సంతలో నిత్యావసర సరకులు, ఇంటికి అవసరమైన సామగ్రి కొనుగోలు చేసుకుని తిరుగుముఖం పట్టారు.

కాటాల వద్దనే చెరకు

- వారం నుంచి తరలించని ఫ్యాక్టరీ అధికారులు
- ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన


అప్పలరాజుపురం కాటా వద్ద చెరకు బండ్లు

చీడికాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలరాజుపురంలో గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కాటా వద్ద వారం రోజుల నుంచి చెరకు తరలింపు జరగడంలేదు. దీంతో రాత్రి, పగలు వేచివుండడమేగాక, ఎండలకు చెరకు ఎండిపోతున్నదని రైతులు వాపోతున్నారు. షుగర్ ఫ్యాక్టరీ నుంచి లారీలు రాకపోవడం వల్లనే చెరకు తరలించలేకపోతున్నామని కాటా సిబ్బంది చెబుతున్నారు. షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల తాము నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి అప్పలరాజుపురం కాటా నుంచి చెరకు తరలింపునకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గోవాడలో చెరకు క్రషింగ్ పునరుద్ధరణ

చోడవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో సాంకేతిక సమస్య తలెత్తడంతో బుధవారం ఆగిపోయిన చెరకు క్రషింగ్‌ను గురువారం ఉదయం 11 గంటలకు పునరుద్ధరించారు. టర్బయిన్‌లో బ్రేకర్ మరమ్మతుకు గురవడంతో బుధవారం ఉదయం క్రషింగ్ ఆగిపోయింది. దీనిని బాగుచేయడానికి యాజమాన్యం చెన్నై నుంచి ఇంజనీర్లను రప్పించింది. గురువారం ఉదయం మరమ్మతులు పూర్తవడంతో క్రషింగ్ పునఃప్రారంభమైంది. ప్రస్తుత సీజన్‌లో బగాస్ కొరత, బాయిలర్, టర్బయిన్ల మరమ్మతుల కారణంగా తరచూ క్రషింగ్ నిలిచిపోతున్నది. దీంతో ఫ్యాక్టరీ యార్డులో, తూనిక కేంద్రాల వద్ద చెరకు బండ్లతో రైతులు రోజుల తరబడి వేచివుండాల్సి వస్తున్నది. మరోవైపు లారీలకు కిరాయి చెల్లింపుల్లో తీవ్ర జాప్యం అవుతుండడంతో కాటాల నుంచి ఫ్యాక్టరీకి చెరకు రవాణా చేయడానికి ఆయా ఆపరేటర్లు విముఖత చూపుతున్నారు. దీనివల్ల ఫ్యాక్టరీకి చెరకు తరలింపు ఆలస్యం అవుతున్నది. గత వారం చెరకు క్రషింగ్ ఆగిపోవడంతో రైతులు రహదారిపై బైఠాయించిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు అనకాపల్లి ఆర్డీవో ఆయీషా ఇక్కడకు వచ్చి విచారణ జరిపారు. క్రషింగ్‌లో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వారం తిరిగేసరికి టర్బయిన్‌లో సమస్య ఏర్పడి క్రషింగ్ నిలిచిపోయింది.

సీఎంకు వినతుల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

ఎంపీ ఎం.శ్రీభరత్, పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, పార్టీ నాయకులు కలిశారు.

అక్రమ మైనింగ్‌పై కొరడా

... 5వ పేజీ తరువాయి

నిర్వాహకులు జరిమానా చెల్లించకుండా కోర్టును ఆశ్రయించారు. ఇదే అదనుగా భావించి కోర్టుకు వెళ్లని క్వారీల నిర్వాహకులు యథావిధిగా మైనింగ్‌ను కొనసాగించారు.

జిల్లాలోని రాయి క్వారీలపై గత కొద్ది రోజులుగా జరుగుతున్న తనిఖీలపై గనుల శాఖ విజిలెన్స్ ఏడీ అశోక్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. అనకాపల్లి జిల్లాలో రాయి క్వారీలపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయని, గనుల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో క్వారీల్లో తనిఖీలు జరుపుతున్నామన్నారు. ఇంకా పత్రికల్లో వచ్చే కథనాలను సుమోటోగా తీసుకొని తనిఖీలు చేస్తున్నట్టు చెప్పారు. అనుమతి లేని క్వారీలను సీజ్ చేసి, అదనంగా తవ్వకాలు జరిపిన క్వారీల నిర్వాహకులకు జరిమానాలు విధించి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామన్నారు.

పంట కాలువల్లో పూడిక

... 5వ పేజీ తరువాయి

కాలువల్లో సరిగా నీరు పారడంలేదు. ప్రస్తుతం తుమ్మపాల గ్రోయిన్ పరిధిలోని భూముల్లో నువ్వు, పొద్దుతిరుగుడు, మినుము, పెసర, వేరుశనగ, టొమేటో, వంగ, బెండకాయ, తదితర పంటలు సాగులో వున్నాయి. కాలువల నుంచి నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కాగా తుమ్మపాల గ్రామం మధ్య నుంచి వెళుతున్న కాలువల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి దోమల నిలయాలుగా మారాయి. కాలువలకు ఇరువైపులా నివాసం వుంటున్నవారు దుర్వాసనతోపాటు దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నారు.

జీవీఎంసీ మేయర్‌పై అవిశ్వాసం?

... 5వ పేజీ తరువాయి

నివేదిక పంపిస్తారు. తర్వాత జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం కోసం కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా సభకు హాజరైనవారి వారిలో మెజారిటీ సభ్యులు చేతులెత్తితే అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు అవుతుంది. అప్పుడు మేయర్ స్థానంలో ఉన్నవారు పదవిని వీడాల్సి ఉంటుంది. ఇదే విషయమై చర్చించేందుకు కూటమి నేతలు అమరావతి వెళ్లి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లను కలిసినట్టు ప్రచారం జరుగుతోంది.

క్రైం... crime news

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైల్వేస్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందడంతో గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపారు. మృతుడి వయసు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. 5.3 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు కలిగి ఉన్నాడన్నారు. అతను బ్రౌన్ కలర్ నెక్ టీ-షర్టు, నలుపు, ఆకుపచ్చ రంగు గల ఫుల్‌ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి కుడి చేతిపైన అమ్మ అని తెలుగులో టాటూ మార్కు ఉందన్నారు. మృతదేహం చుట్టు పక్కల ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 7382058996 సెల్ నంబరును సంప్రతించాలని ఆమె కోరారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అనారోగ్య సమస్యతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ఎస్.రాయవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యతో చదువులో వెనుకబడిపోతున్నట్టు భావించిన ఇంటర్ విద్యార్థిని ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సంబంధించి విద్యార్థిని కుటుంబీకులు, ఎస్‌ఐ విభీషణరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. మండలంలోని కోనవానిపాలెం గ్రామానికి చెందిన జోగా సృజన జయప్రియ(17) తునిలోని ఒక కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నాయి. బుధవారం ఇంగ్లిష్ పరీక్ష రాసింది. గురువారం ఆమెకు నలతగా వుండడంతో గమనించిన తండ్రి నాగసింహాచలం.. విశ్రాంతి తీసుకోమని చెప్పి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో తిరిగి ఇంటికి వచ్చాడు. సృజన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించింది. వెంటనే కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ విభీషణరావు అక్కడకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సృజన రాసిన లేఖను పరిశీలించారు. 'అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాను. దీంతో చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నాను. అందుకే చనిపోతున్నాను. నన్ను క్షమించండి' అంటూ తల్లిదండ్రులను ఉద్దేశించి లేఖ రాసింది. మృతదేహానికి నక్కపల్లి సీహెచ్‌సీలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తండ్రి నాగసింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.


సృజన జయప్రియ (ఫైల్ ఫొటో)

గెడ్డలోకి దూసుకుపోయిన బైక్

- తండ్రి, కుమార్తెకు గాయాలు


గెడ్డలో పడిపోయిన ద్విచక్ర వాహనం (ఇన్‌సెట్‌లో) తలకు గాయమైన బాలిక

చోడవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం సమీపంలో కర కల్వర్టు వద్ద గురువారం సాయంత్రం వాహన ప్రమాదం సంభవించింది. ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు.. ఇరుకుగా వున్న కల్వర్టు వద్ద తప్పుకునే ప్రయత్నంలో ఓ మోటారు బైక్ అదుపుతప్పి గెడ్డలోకి పడిపోయింది. బైక్ నడుపుతున్న చీడికాడ మండలానికి చెందిన పాము శ్రీను, అతని కుమార్తె గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి గెడ్డలో నుంచి క్షతగాత్రులను బయటకు తీసి, ఆస్పత్రికి తరలించారు. కాగా వెంకన్నపాలెం వద్ద శిథిలమైన కల్వర్టు ప్రమాదభరితంగా తయారైంది. రెండువైపులా రక్షణ గోడలు లేకపోవడం, కల్వర్టు వద్ద రోడ్డు ఇరుకుగా వుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రక్షణ గోడలు కట్టించడం మాట అటుంచి కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు.

ఇంటర్ పరీక్షకు 14,133 మంది హాజరు

అనకాపల్లి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. జనరల్ విద్యార్థులు 12,063 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 11702 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,647 మందికి గాను 2,431 మంది హాజరయ్యారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439